Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 240 పేజీలు (Pages): 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 3 - 5 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## 200 ప్లస్ సీట్లతో మనమే గెలుస్తాం.. మమతా బెనర్జీ ధీమా



**కోల్‌కతా :** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘనవిజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. ఈనెల 4న కౌంటింగ్ జరుగనుండటంతో కౌంటింగ్ ఏజెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం నాడు ఆమె మాట్లాడారు. '200కు పైగా సీట్లతో మనం గెలవబోతున్నాం' అని ఈ సందర్భంగా మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ కేవలం స్టాక్ మార్గెట్‌ను మభ్యపెట్టేందుకే తప్ప మరొకటి కాదని, 2021, 2024లోనూ వాళ్లు ఇదే చేశారని, ఇప్పుడు కూడా జరిగిందదేనని మమతా బెనర్జీ వివరించారు. సీఏపీఎఫ్ దౌర్జన్యాలకు గురైన టీఎంసీ కార్యకర్తలకు రాబోయే రోజుల్లో తాము రివార్డులిస్తామని చెప్పారు.

**ఫాల్టాలో ఉద్రిక్తత.. టీఎంసీపై స్థానికుల ఫిర్యాదు**

కాగా, రెండు అసెంబ్లీ నియోజక వర్గాల్లోని 15 పోలింగ్ కేంద్రాల్లో శనివారంనాడు రీపోలింగ్ జరిగింది. పెద్దఎత్తున ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ క్రమంలో సౌత్ 24 పరగణాల జిల్లాలోని ఫాల్టాలో టీఎంసీ, బీజేపీ మద్దతుదారుల మధ్య ఘర్షణలు సైతం చోటు చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల వరకూ ఎలాంటి ఘటనలు జరగనప్పటికీ ఫాల్టాలో స్థానికులు ఆందోళన బాటపట్టడం ఉద్రిక్తతలకు దారి తీసింది. టీఎంసీ గూండాలు తమను బెదిరిస్తున్నారని, కేంద్ర బలగాలైన సీఏపీఎఫ్‌ను మోహరించి తమకు రక్షణ కల్పించాలని స్థాని కులు రోడ్లపైకి వద్ద ఆందోళనలకు దిగారు. అధికారులు వెంటనే స్పందించడంలో సీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ దళాలను మోహరించారు. టీఎంసీ గూండాలు బెదిరిస్తున్నారని, వారు గెలిస్తే తమ ఇళ్లు తగుల బెడతారని, రక్తపాతం తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు భారీ బలగాలు మోహరించినా టీఎంసీ గుండాల హింస, ఆందోళనకు ఆగడం లేదని బీజేపీ ఆరోపించింది. పశ్చిమ బెంగాల్‌లోని ఒక స్ట్రాంగ్ రూమ్‌ను అనుమతి లేకుండా కొందరు తెరిచారని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈనెల 4న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

## మంత్రి లోకేశ్ పనితీరు చాలా బాగుంది.. వెంకయ్యనాయుడు ప్రశంసలు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఏపీ విద్యశాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరు చాలా బాగుందని భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసించారు. ఈ ఏడాది పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు తీసుకువచ్చారని కొనియాడారు. మాజీ ప్రధాని వాజ్‌పాయ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో నాలుగుసార్లు కేంద్రమంత్రిగా, ఉపరాష్ట్రపతి పదవులు స్వీకరించానని ప్రస్తావించారు. తన కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపా వెంకట్‌లతో... వారి వ్యాపారాల్లో తాను కలగజేసుకోనని, తన రాజకీయాల్లోకి వారు రావొద్దనే గౌరవ ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. మంచి పనులు చేసే వారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని వెంకయ్యనాయుడు సూచించారు.

**తల్లిదండ్రులు పిల్లలకు సమయాన్ని కేటాయించట్లేదు..**

శనివారం నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం గొలగమూడిలో ఆయన పర్యటించారు. శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి జీవిత చరిత్ర, విశ్వంభరుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నెల్లూరు ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ సురేశ్ రెడ్డి, దీపావెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు. ఆధ్యాత్మికత మానసిక ఉల్లాసాన్ని, ఆనందాన్ని కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. తల్లిదండ్రులు పిల్లలకు సమయాన్ని కేటాయించట్లేదని.. మొబైల్, టీవీలకు మాత్రమే సమయాన్ని కేటాయించడం




సరికాదని పేర్కొన్నారు.

**పత్రికల్లో వచ్చే వార్తలను చూస్తోంటే సిగ్గేస్తోంది..**

తిరుమల వేంకటేశ్వరస్వామిని ఏడాదిలో ఒక్కసారి మాత్రమే దర్శించుకోవాలని తాను నిర్ణయం తీసుకున్నానని చెప్పుకొచ్చారు. సమాజం గతి తప్పినప్పుడే వారిని సరైన మార్గంలో పెట్టేందుకు దివ్య స్వరూ పులైన యోగి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి, పుట్టపర్తి సాయిబాబా, షిర్డీ సాయిబాబాలాంటి అవధూతలు భూమిపైకి వచ్చారని ప్రస్తావించారు. ఏదైనా పని చేయాలంటే మనసులో, కుటుంబంలో, గ్రామంలో, రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో కూడా శాంతి ఉండాలని సూచించారు. పాశ్చాత్య వ్యామోహం ఎక్కువై మనదేశంలో కూడా మార్పులు వస్తున్నాయని తెలిపారు. రోజూ పత్రికల్లో వచ్చే వార్తలను చూస్తోంటే సిగ్గేస్తోందని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

## జైల్లో ప్రత్యేక సదుపాయాలు కోరిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు



**కాకినాడ, (రాజధాని వార్తలు):** రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు వ్యవహారంపై ఏబీఎన్‌లో వరుస కథనాలు ప్రసారం అయిన నేపథ్యంలో జైలు అధికారులు స్పందించారు. అనంతబాబు జైల్లో ప్రత్యేక సదుపాయాలు కోరిన విషయం వాస్తవమేనని అధికారులు అంగీకరించారు. అయితే జైలు నిబంధనలు, న్యాయస్థానం ఆదేశాల ప్రకారం మాత్రమే సదుపాయాలు కల్పిస్తామని ఆయనకు స్పష్టంగా తెలియజేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. జైలు నిబంధనలకు లోబడి ఖైదీలకు అవసరమైన సదుపాయాలు మాత్రమే అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

## టీడీపీ సీనియర్ నేత వల్లభనేని బాబురావు కన్నుమూత

**కృష్ణాజిల్లా గుడివాడ, (రాజధాని వార్తలు):** రాజకీయాల్లో తన కంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగు దేశం పార్టీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత వల్లభనేని బాబురావు తుదిశ్వాస విడిచారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని తన స్వగృహంలో కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన వృద్ధాప్య సమస్యలతో బాధ పడుతున్నారు. బాబురావు టీడీపీ వ్యవస్థాపక కాలం నుంచి పార్టీలో క్రియాశీలక నేతగా పనిచేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం ఆయన సేవలందించారు. ఆయన మృతి వార్త తెలియగానే కృష్ణా జిల్లాకు చెందిన కూటమి నేతలు (టీడీపీ, జనసేన, బీజేపీ), కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆయన స్వగృహానికి చేరుకున్నారు. బాబురావు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మరణం జిల్లా రాజకీయాలకు, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీకి తీరని లోటని నేతలు పేర్కొన్నారు. వల్లభనేని బాబురావు మృతిపై పలువురు రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు





**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. ఇటీవల పవన్ కల్యాణ్‌కు సర్జరీ జరగడంతో ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో శనివారం హైదరా బాద్‌లోని పవన్ కల్యాణ్ నివాసానికి సీఎం చంద్రబాబు వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన సీఎం చంద్రబాబు, తగి నంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కాగా, పవన్ కల్యాణ్ ఇటీవల అస్వస్థతకు గురవడంతో హైదరాబాద్, జూబ్లీ హిల్స్‌లోని అపోలో ఆసుపత్రిలో చేరారు. ఆయనకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ముక్కుకు సంబంధించిన 'ఫంక్షనల్ ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ'ని పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, పవన్ కల్యాణ్‌కు కొన్ని రోజుల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యులు స్పష్టం చేశారు.

## జీఎన్ నాయుడు పార్థివ దేహానికి సీఎం చంద్రబాబు నివాళులు





**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** పారిశ్రామిక వేత్త, రీజెన్సీ గ్రూప్ అధినేత జీఎన్ నాయుడు పార్థివ దేహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళులర్పించారు. హైదరాబాద్‌లో వారి నివాసానికి వెళ్లి జీఎన్ నాయుడుకు నివాళులర్పించారు. తెలుగు ప్రజలు మంచి పారిశ్రామికవేత్తను కోల్పోయారని, రీజెన్సీ స్థాపనతో యువతకు ఉపాధి కల్పనలో జీఎన్ నాయుడు కృషి ఎనలేనిదని సీఎం అన్నారు.

సమాజ సేవకు జీఎన్ నాయుడు తన వంతు కృషి చేశారని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించిన సీఎం.. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా జీఎన్ నాయుడుతో తనకు ఉన్న పరిచయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు.

## అమరావతి అభివృద్ధిలో మరో ముందడుగు.. క్వాంటం వ్యాలీలో ట్విన్ టవర్లకు గ్రీన్ సిగ్నల్



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా ఏపీ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాజధాని ప్రాంతంలోని క్వాంటం వ్యాలీలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించతలపెట్టిన ట్విన్ ఆఫీస్ టవర్ల నిర్మాణానికి అధికారికంగా పరిపాలన అనుమతులు లభించాయి. రాజధాని నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, పరిపాలనా యంత్రాంగానికి అవసరమైన కార్యాలయాల కోసం ఈ ట్విన్ టవర్లను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. ట్విన్ టవర్ల 'షెల్ అండ్ కోర్' నిర్మాణ పనుల కోసం రూ. 1208.41 కోట్లు కేటాయిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల (ఏప్రిల్) 23వ తేదీన జరిగిన 60వ ఏపీసీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ నిధులను మంజూరు చేసింది.

**టెండర్ల విధానం..**

ఈ ప్రాజెక్టును 'డిజైన్ బిల్డ్ లంప్సమ్' పర్సంటేజ్ టెండర్ విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల నిర్మాణ సంస్థ ప్లానింగ్, డిజైనింగ్, ఎగ్జిక్యూషన్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. ఈ భారీ నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌ను ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. ప్రాజెక్టు పర్యవేక్షణ, అమలు బాధ్యతలను ఏజీఐసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

**ప్రాధాన్యం..**

క్వాంటం వ్యాలీ ప్రాంతంలో ఈ టవర్లు రావడం వల్ల ఐటీ, పరిపాలన, వాణిజ్య రంగాలు మరింత వేగంగా వృద్ధి చెందే అవకాశం ఉంది. అమరావతిని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే క్రమంలో ఇవి ఐకానిక్ కట్టడాలుగా నిలవనున్నాయి. అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచిన ఏపీ ప్రభుత్వం రూ. 1208.41 కోట్లకు పైగా నిధులతో ట్విన్ టవర్ల నిర్మాణానికి పచ్చజెండా ఊపడం రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్, అభివృద్ధి పనులకు కొత్త ఊపునిస్తోంది.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోరం.. ఐఈడీ పేలి ముగ్గురు జవాన్లు మృతి

**ఛత్తీస్‌గఢ్ :** కాంకేర్ జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించింది. ఐఈడీ పేలుడు ధాటికి ముగ్గురు జవాన్లు మృతి చెందగా.. మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయి. మావోయిస్టులు అమర్చిన మందుపాతర తొలగిస్తుండగా ప్రమాదవశాత్తూ పేలింది. నారాయణ్‌పూర్ జిల్లాకు ఆనుకుని ఉన్న ఛోటేబేతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఛత్తీస్‌గఢ్‌ని మార్చి 31న సాయుధ మావోయిస్టులు లేని రాష్ట్రంగా ప్రకటించారు. అయితే, గతంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేసేందుకు డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) బృందం మైన్ల తొలగింపు ఆపరేషన్ చేస్తోంది. శనివారం మైన్ల తొలగింపు చేస్తుండగా ప్రమాదవశాత్తూ ఐఈడీ పేలింది. దీంతో



నలుగురు డీఆర్జీ జవాన్లు తీవ్రంగా గాయపడగా..వారిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజ్ తెలిపారు. మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయని, చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. సాయుధ మావోలు లేని రాష్ట్రంగా ప్రకటించిన తర్వాత ఇది తొలి పేలుడు ఘటన అని ఐజీ సుందర్ రాజ్ పేర్కొన్నారు.

# హరివిల్లు ఆధ్వర్యంలో ప్రపంచ నవ్వుల దినోత్సవ సంబరాలు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** హరివిల్లు క్రియేషన్స్ మరియు నెల్లూరు కామెడీ ఆధ్వర్యంలో నెల్లూరు 25 కళా సంఘాల ఛాంబర్లో 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు, హాస్యనటుడు దోర్నాల హరిబాబు ఆధ్వర్యంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి ప్రజలకు ప్రపంచ నవ్వుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నెల్లూరుకు చెందిన హాస్యనటుడు కట్టోజు సతీష్ కుమార్‌ను నిర్వాహకులు సత్కరించడం జరిగింది. సతీష్ కుమార్ గత 30 సంవత్సరాలుగా కామెడీ నాటికలు, హాస్యవల్లరి కార్యక్రమాలతో నెల్లూరు ప్రజలకు చిరపరిచితుడు. ఈ సందర్భంగా 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ..నవ్వడం యోగం, నవ్వించడం భోగం, నవ్వకపోవడం రోగం అని ప్రముఖ సినీ దర్శకులు కీర్తిశేషులు జంధ్యాల చెప్పినట్లు, నవ్వు ఆరోగ్యాన్ని పంచుతుందని చెప్పారు. హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు దోర్నాల హరిబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే నెల మొదటి ఆదివారాన్ని ప్రపంచ నవ్వుల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందని ఈ నెల మూడో తేదీ ఆదివారం ప్రపంచం నవ్వుల దినోత్సవం సందర్భంగా ఈ సంబరాలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమీర్ ఆర్ట్స్ అకాడమీ అధినేత గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ డాక్టర్ షేక్ అమీర్ జాన్, హాస్యనటుడు కే.సతీష్ కుమార్, సురభి మేకప్ ఆర్టిస్ట్ వనారస లక్ష్మీకాంత బాబు, హరివిల్లు సభ్యులు దోర్నాల కామేశ్వరరావు మరియు దోర్నాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎండల వేళ చల్లని ఊరట - నెల్లూరులో వీఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సేవా స్ఫూర్తి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలో భానుడి ప్రతాపం రోజురోజుకు పెరుగుతోంది. ఎండ వేడికి తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న సామాన్యులకు బాసటగా నిలుస్తున్నారు పలువురు స్వచ్ఛంద సేవాకర్తలు. నెల్లూరులోని వీఆర్ కళాశాల 1983-86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ సేవాగుణాన్ని చాటుకున్నారు. నగరంలోని వీఆర్ కాలేజీ కాలేజీ నందు మున్సిపల్ కమిషనర్ వైఓ నందన్ చేతుల మీదుగా ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ వై ఓ నందన్ మాట్లాడుతూ నెల్లూరులో ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు వీఆర్ కళాశాల 1983-86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఒక అడుగు ముందుకు వేశారు. నగరంలోని నారాయణ మెడికల్ హాస్పిటల్ మరియు ఇతర ప్రాంతాలకు వెళ్లే బాటసారులకు వీరు చల్లని మజ్జిగను అందిస్తూ తమ మాతృ సంస్థపై ఉన్న అభిమానాన్ని చాటుకుంటున్నారు.

పూర్వ విద్యార్థి ప్రతినిధి: "మేమంతా 1983-86 బీకామ్ బ్యాచ్ విద్యార్థులం. గత ఏడాది కేవలం ఐదు రోజులు అనుకున్న ఈ కార్యక్రమాన్ని ఈసారి నెలంతా కొనసాగిస్తున్నాం. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ప్రోత్సాహం మాకు ఎంతో బలాన్ని ఇచ్చింది. రోజూ వందలాది మంది బాటసారులు ఇక్కడ మజ్జిగ తాగి దాహం తీర్చుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు టి.వెంకటేశ్వరరావు, టి.వి.శ్రీనివాసరావు. టి.వి. సుబ్బారావు, శరత్, హనుమయ్య, ప్రసాద్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్‌సి 2026 పరీక్షా ఫలితాలలో శ్రీ మేధ హై స్కూల్ విజయభేరి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని పెద్ద బజార్‌లో ఉన్న శ్రీ మేధా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఎస్.ఎస్.సి 2026 పరీక్ష ఫలితాలలో విజయభేరి మ్రోగించారు. ఈ ఫలితాలలో వై.గౌతమ్ మరియు ఎం.డి అసదుల్లా బేగ్ ఇద్దరు విద్యార్థులు 590 మార్కులతో స్కూల్ టాపర్స్ గాను, ఈ ప్రాంతంలోనే అత్యధిక మార్కులను సాధించి శ్రీ మేధ స్కూల్ నెంబర్ వన్‌గా నిలిచింది. అలాగే ఎస్.కె. వసీమ్ 583, ఎస్.కె.సాహిల్ 572, టీ.అనూష 571, ఎస్. కె.అబ్దుల్ లతీఫ్ 567 ,ఎస్.కె. పూనమ్ 564, ఎం.జ్యోత్స్న 562, ఎస్.కె.నిహాల్ 554. ఇలాగే 9 మంది విద్యార్థులకు ప్రతి ముగ్గురిలో ఒకరికి 550 పైగా మార్కులు సాధించడం జరిగింది. అదేవిధంగా 500 మార్కుల పైన 14 మంది విద్యార్థులు, 400 మార్కులు పైగా, 12 మంది, 300 మార్కులు పైన 6 మంది సాధించడం జరిగింది. సబ్జెక్టు వారీగా 100 మార్కులు మ్యాక్స్‌లో ఇద్దరూ, సైన్స్‌లో ముగ్గురు, సోషల్‌లో నలుగురు, 99 మార్కులు తెలుగులో ముగ్గురు, హిందీలో ముగ్గురు, 98 మార్కులు ఇంగ్లీషులో ముగ్గురు సాధించడం జరిగింది. అందరూ విద్యార్థులు ఫస్ట్ క్లాస్ రిజల్ట్స్‌తో ఉత్తీర్ణులవడం చాలా సంతోషదాయకం. ఇలా ప్రతి సంవత్సరం విద్యార్థుల స్థాయి ఏదైనా, అసాధారణ ఫలితాలలో అత్యధిక మార్కులను సాధిస్తున్న సంస్థ "శ్రీ మేధ." శ్రీ మేధ స్కూల్ అంటే విద్యార్థుల లక్ష్యాలను, తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టే విద్యా సంస్థ దీనికి ప్రధాన కారణం స్కూల్‌నందు నిర్వహించే పటిష్టమైన ప్రణాళిక, అర్హత, అనుభవం, అంకితభావం కలిగిన ఉపాధ్యాయులచే అత్యుత్తమ బోధన, రెమిడీయల్ టీచింగ్, మేనేజ్మెంట్ టీచింగ్ చేస్తూ ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడం వల్లనే ప్రతి సంవత్సరం శ్రీ మేధ స్కూల్ అద్భుత ఫలితాలను సాధిస్తుంది ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులకు హార్దిక శుభాకాంక్షలు వారి తల్లిదండ్రులకు అధ్యాపక అధ్యాపకేతర బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పి.కొండారెడ్డి స్కూల్ డైరెక్టర్ పి లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 3వ డివిజన్లో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసిన బత్తల శ్రీకాంత్

**- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ డొక్కా సీతమ్మ స్ఫూర్తితో మజ్జిగ చలివేంద్రం, శ్రీకాంత్ - మేడే సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు బట్టలు పంపిణీ**

**- నెల రోజులపాటు రస్నా, మజ్జిగ, ఫ్రూట్ జ్యూస్ ఏర్పాటు శ్రీకాంత్**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక మూడో డివిజన్ జనసేన పార్టీ నాయకులు బత్తల శ్రీకాంత్ మండుతున్న ఎండలకు డివిజన్లోని ప్రశాంతి నగర్ కూడలి వద్ద ఉచిత మజ్జిగ చలివేంద్రం నేడు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చిట్టమూరు ప్రవీణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిత్తలూరు సుందర్ రామిరెడ్డి జనసేన పార్టీ ప్రోగ్రాం కమిటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి కారంపొడి కృష్ణారెడ్డి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. సుమారు వెయ్యి మంది వరకు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. అలాగే మేడే సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సేవా కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకున్న బత్తల శ్రీకాంత్ డివిజన్ ప్రజలకు తన వంతు సహకారాలు అందిస్తూ అలాగే వేసవిదృష్ట ప్రజల దాహార్తిని తీర్చాలన్న గొప్ప సంకల్పంతో ఈ యొక్క కార్యక్రమం చేపట్టడం శుభ పరిణామం అని ఇలాంటి వారిని జనసేన పార్టీ గుర్తించి మంచి భవిష్యత్తు ఇస్తుందని ఇలాంటి చక్కటి కార్యక్రమం ఏర్పాటు చేసిన శ్రీకాంత్‌రిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శిలు షేక్ కరీం, జనసేన నాయకులు కాకు మురళి రెడ్డి, జూటూరు మహేష్ శర్మ,వార్డు ఇంచార్జు గుర్రం కిషోర్,గుత్తి శ్రీకాంత్, పేనేటి శ్రీకాంత్, వంగళ్ల శ్రీనివాసులు, బిళ్ళ ఉదయ్ కుమార్, మనోజ్, లోకేష్, వెంకటేష్, సుజయ్, భాను, హేమంత్, శ్రీధర్, వీర మహిళలు లక్ష్మి, తేజస్వి, లత, జనసైనికులు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేసారు.


# పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు ఎంపీ విపిఆర్ ప్రశంస




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థినులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశంసించారు. మెట్టప్రాంతం వింజమూరులోని శ్రీ నేతాజీ వికాస్ హై స్కూల్ అండ్ కాలేజ్‌లో చదువుతున్న విద్యార్థిని సిహెచ్ లిఖిత పదవ తరగతి ఫలితాల్లో 598 మార్కులు సాధించి జిల్లా మొదటి స్థానం, అలాగే రాష్ట్రంలో రెండవ స్థానం సంపాదించింది.

అలాగే 595 మార్కులతో ఎల్లాల భావన ప్రతిభ చూపగా వారు ఈ సందర్భంగా శుక్రవారం నెల్లూరులోని విపిఆర్ నివాసంలో ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ వారిని అభినందించారు. మెట్ట ప్రాంతానికి చెందిన మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థినులు అద్భుత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో మంచి మార్కులు సాధించడం సాధా రణ విషయం కాదన్నారు. విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో శ్రీ నేతాజీ వికాస్ హై స్కూల్ సంస్థ డైరెక్టర్ ఎల్సి రమణారెడ్డి, కరస్పాండెంట్స్ కె.వి రత్నం, ఎన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రామతీర్థంలో జరిగిన సాయిరామ్, సాయి వైష్ణవి వివాహ వేడుకల్లో పలువురు ఆశీస్సులు



**విడవలూరు, (రాజధాని వార్తలు):** విడవలూరు మండలం పరిధిలోని రామతీర్థం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కామాక్షి దేవి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన సాయిరామ్, సాయి వైష్టవి వివాహ వేడుకల్లో ప్రముఖ నాయకులు నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఆయురారోగ్యాలతో భోగ భాగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని బంధువులు, స్నేహితులు, పలువురు స్థానిక నేతలు ఆకాంక్షించారు. వివాహంలో పూజారి పేరేపి శ్రీకాంత్ శర్మ వేద మంత్రాలతో సాంప్రదాయ పద్ధతిలో మాంగళ్యం జరిపించారు. ఈ కార్యక్రమంలో బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్దన్ రావు, కటారి సుబ్రహ్మణ్యం, ఉప్పాల కోటయ్య, హజరత్, రమణయ్య, వెంకట రమణయ్య, పలువురు సామూహికంగా పాల్గొని జడపల్లి సాయి రామ్ పెండ్లి సందడికి హాజరయ్యారు. కార్యనిర్వహకులుగా ముక్కు మోహన్, విజయమ్మలు వ్యవహరించారు.

# అనిల్ ఆగయా..నెల్లూరు జిల్లా మే నయా గేమ్ షురూ హోగయా

**- రాజన్న భవన్‌లో మాజీ మంత్రి అనిల్ సందడి - నెల్లూరు జిల్లాకు అనిల్ అవసరం - రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం..ప్రజల మనసుల్లో అనిల్‌పై అభిమానం శాశ్వతం - అభిమానులకు త్వరలో అనిల్ గుడ్ న్యూస్..చాన్నాళ్ళ తర్వాత రాజన్న భవన్ నుండి రాజకీయంపై చర్చ - అనిల్ రాక కోసం అభిమానులు, జిల్లా వాసులు ఎదురుచూపు - కొందరు పొగరు అంటారు, కొందరు అతి విశ్వాసం అంటారు, కొందరు అహంకారం అంటారు, మరికొందరు పెడర్థం అంటారు..కానీ అది పొగరు కాదు గుండె ధైర్యం, అతి విశ్వాసం కాదు అది ఆత్మవిశ్వాసం, అహంకారం కాదు తనపై తనకు నమ్మకం, పెడర్థం కాదు ఇచ్చిన మాట కోసం ఎంత దూరం అయినా నిలబడే మొండితనం..అనిల్‌లో ఉండే కొన్ని క్వాలిటీస్ కొందరికి నెగటివ్‌గా కనిపించినా అనిల్ ఆల్వేస్ పొలిటికల్ కింగ్ అంటున్న అభిమానులు - పార్టీ అధినాయకుడు జగన్‌కు, ప్రజలకు అనిల్ అంటే ప్రత్యేక ప్రేమ, అభిమానం - పార్టీ కోసం నాయకుడి కోసం ప్రాంతం మారినా సొంత జిల్లాలో అనిల్‌కు తగ్గని క్రేజ్ - ఈసారి నెల్లూరు జిల్లా నుండే ఎన్నికల బరిలో అనిల్ - రాష్ట్ర రాజకీయాల్లో అనిల్ ఓ బ్రాండ్ - ఒక నియోజక వర్గానికి పరిమితం కాకుండా జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా అనిల్‌కు అభిమానులు - చిన్న వయసులో రాజకీయంగా ఉన్నత శిఖరాలకు చేరిన అనిల్‌పై అనేకమందికి ఈర్ష్య - ఒక్కసారి నా అనుకున్నాడు అంటే అధికారంలో వున్నా లేకున్నా, జిల్లాలో ఉన్నా బయట ఉన్నా వారికి అండగా అనిల్ - వైసిపి పార్టీకి అనిల్ ఓ ట్రంప్ కార్డు - రాజకీయ ప్రత్యర్థులు అనిల్ ఓ అరాచకం..అభిమానులకు అనిల్ ఓ ఆరాధ్య దైవం**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా రాజకీయాల్లో మాజీ మంత్రి నెల్లూరు నగర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్‌ది ప్రత్యేక స్థానం అని చెప్పవచ్చు, రాజకీయాల్లోకి ఎందరో వస్తూ ఉంటారు పోతూ ఉంటారు, కొన్ని రోజులు అధికారంలో ఉంటారు కొన్ని రోజులు ప్రతిపక్షంలో ఉంటారు, కొన్ని సార్లు కనుమరుగైపోతూ వుంటారు, కానీ తాము చేసే పనుల వల్ల ప్రజలతో మెలిగే విధానం వల్ల రాజకీయ నాయకులకు అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల మనసుల్లో అతికొద్ది మంది మాత్రమే శాశ్వతమైన స్థానం సంపాదించుకుంటారు అలాంటి అతి కొద్ది మంది వారిలో అనిల్ ఒకరు, నెల్లూరు నియోజకవర్గం నుండి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఓసారి మంత్రిగా వ్యవహరించిన అనిల్ కుమార్ యాదవ్‌పై జిల్లాలో అనేక మంది అనేక రకాల అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు అవి వారి వ్యక్తిగతం, కానీ జిల్లా వైసీపీ పార్టీ శ్రేణుల్లో నియోజక వర్గాలతో సంబంధం లేకుండా అనిల్‌కు ఒక ఫ్యాన్స్ బేస్ ఉంది, అది సామాజిక పరంగా కావచ్చు, అనిల్ వాక్చాతుర్యం కావచ్చు, పార్టీ పట్ల నిబద్ధత కావచ్చు, అనిల్ ఒక్కసారి నా అనుకున్నాడంటే అధికారంలో వున్నా లేకున్నా అభిమానం మాత్రం తగ్గదు..కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో పార్టీ అధినేత జగన్ ఆదేశాల మేరకు బయట జిల్లాలో పోటీ చేయాల్సి వచ్చి సొంత జిల్లా,సొంత నియోజక వర్గంకు దూరం అవ్వాల్సి వచ్చింది, కాలం గిర్రున తిరిగింది ఎన్నికలు పూర్తయి సుమారు రెండేళ్ళు కావస్తుంది, నెల్లూరు జిల్లాను వదిలిన అనిల్ తిరిగి నెల్లూరు జిల్లా నుండే తన ప్రస్థానం మొదలుపెట్టేందుకు సిద్ధం అయ్యాడు, కానీ ఎక్కడనుండి ఈ ప్రయాణం అనేది అభిమానుల్లో ఉత్కంఠ రేపుతున్న అంశం, 2019 లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 10 కి 10 సీట్లు గెలిచిన వైఎస్ఆర్సీపీ 2024 లో 10కి 10 సీట్లు ఓడిపోయింది. గెలుపు ఓటములు అటుంచితే గతంలో వైసీపీలో వున్న కొందరు బలమైన నేతలు టిడిపిలోకి వెళ్లిపోవడంతో జిల్లాలో వైసిపి పార్టీకి ఓటర్లు బలం వున్నా నాయకుల పరంగా కాస్తా బలహీన పడింది. వైసీపీ నుండి టీడీపీలోకి వెళ్ళిన ఆ్రెడీ టీడీపీలోనే ఉన్న కొందరితో రాబోయే ఎన్నికల్లో ఢీ కొట్టడం అంటే సామాన్య విషయం కాదు, ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యర్ధి ఎంతటి వాడైనా బలంగా ఢీ కొట్టి నెగ్గుకు రాగల సత్తా అనిల్ సొంతం. ఇలాంటి పరిస్థితిలో అనిల్ అవసరం జిల్లా వైసీపీ పార్టీకి ఎంతో ఉంది. వైసీపీకి అనిల్ ఓ ట్రంప్ కార్డులాంటి వాడు.

గతంలో నగరంలోని రాజన్న భవన్ నుండి రాజకీయాలు నడిపిన అనిల్ తిరిగి చాలా కాలం తర్వత రాజన్న భవన్‌కు వచ్చి తన మిత్రులు, సన్నిహితులతో కాసేపు కూర్చుని సరదాగా గడిపాడు. అనిల్ అధికారంలో వున్నప్పుడు రాజకీయ సందడి, అధికార దర్పంతో ఓ వెలుగు వెలిగిన రాజన్న భవన్‌కు నేడు అనిల్ తిరిగి రావడంతో గత స్మృతులతో పాటు రాబోయే రోజుల్లో రాజన్న భవన్ తిరిగి తన రాజకీయ వైభవాన్ని సంతరించుకోవాలని, ఎక్కడ ఆపాడో అక్కడే మొదలు పెట్టాడని అనిల్ రాజకీయ అడుగులు తిరిగి రాజన్న భవన్ నుండే మొదలు కానున్నాయని అనిల్ అన్న రాజన్న భవన్‌కు రావడంపై ఆయన అభిమానులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# పింఛన్ల పంపిణీతో ప్రతి ఇంటా సంతోషం

**- ఇచ్చిన మాట మేరకు పింఛన్లు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదే - ఇంటింటికి తిరిగి అర్హులకు అందిస్తున్నాం - 23 నెలల కాలంలోనే సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశారు - అలగానిపాడులో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో సీఎం చంద్రబాబు పింఛన్లు పెంచి ప్రతి ఇంటా సంతోషం నింపారని కోవూరు ఎమ్మెల్యే, పొలిట్ బ్యూరో సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. విడవలూరు మండలం అలగానిపాడుగ్రామంలో శుక్రవారం పిం ఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక నాయకులతో కలసి పింఛన్లు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఒకటో తేదీ సెలవు అయితే.. 31వ తేదీనే పింఛన్లు అందించడం గర్వకారణ మన్నారు. గ్రామంలో 210 మందికి 9.54 లక్షలు అందజేస్తు న్నామన్నారు. పెంఛన్లతో పాటు సూపర్ సిక్స్ పథకాలను సూపర్ సిక్స్ చేశారన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలు అమలు చేశారన్నారు. రాబోయే రోజుల్లో సంక్షేమం, అభివృద్ధి పనులకు నిదులు కేటాయి స్తున్నామన్నారు. 23 నెలల్లోనే 1.27 కోట్లు కేటాయించామన్నారు. 13 లక్షలతో సీసీ రోడ్లు, 27 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్, గుడ్డి కాలువకు 10 లక్షలు, గ్రావెల్ రోడ్డుకు 10 లక్షలు, ఎలక్ట్రికల్ పనులను వేగవంతం చేశామన్నారు. త్వరలోనే 3 ఫేజ్ పనులు పూర్తవుతాయన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా 5 మందికి 2.89 లక్షలు అందజేశామని వివరించారు. రాబోయే రోజుల్లో స్థానికులు తెలిపిన అభివృద్ధి పనులను పూర్తి చేస్తామన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, అందుకు అనుగుణంగానే పాలన సాగిస్తున్నారని వివరించారు.

స్థానిక నాయకులు కూడా ప్రజల సమస్యలను గమనించి వాటికి పరిష్కారం చూపాలన్నారు. ఎప్పుడైనా తన వద్దకు వచ్చి పరిష్కారాలు చూపించుకోవాలన్నారు. నాయకు లందరూ ఐకమత్యంగా పనిచేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. స్కూళ్లు తెరిచే లోపల ఎక్కడైనా మౌలిక వసతులు కల్పించాల్సిన ప్రాంతాల్లో పి4 కింద వాటిని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

# నెల్లూరులో తెలుగుదేశం పార్టీ మహానాడుకి స్థలాల పరిశీలన

**- పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ - అనువైన స్థలాల ఎంపికపై సుధీర్ఘ కసరత్తు - ఇఫ్కో భూములు, రేగడి చెలిక వద్ద 110 ఎకరాల స్థలాలను పరిశీలించిన నేతలు - కోవూరును సెలెక్ట్ చేస్తే అది మా అదృష్టంగా భావిస్తాం : ఎమ్మెల్యే ప్రశాంతమ్మ**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులో తొలిసారి నిర్వహించ తలపెట్టిన తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు నిర్వహణకు అనువైన స్థలాలను నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, పొలిట్ బ్యూరో సభ్యులు ప్రశాంతమ్మ పరిశీలించారు.

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కాకర్ల సురేష్, కృష్ణారెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులతో కలిసి శుక్రవారం కోవూరు జాతీయ రహదారి సమీపంలో ఇఫ్కో భూములు, రేగడి చెలిక వద్ద 110 ఎకరాల స్థలాలను పరిశీలించారు. పరిశీలనలో రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కనీస వేతనాల కార్పొరేషన్ ఛైర్మన్ పెల్లకూరు శ్రీనివా సులురెడ్డి ఇతర నేతలు తదితరులు ఉన్నారు. స్థలాలను పరిశీ లించిన అనంతరం వివరాలను కేంద్ర పార్టీకి వివరించనున్నారు. కేంద్ర పార్టీ టీం మరొకసారి పరిశీలించి అన్నిటికీ అనువైన స్థలాన్ని ఫైనల్ చేస్తారు. ఇఫ్కో కిసాన్ సెజ్ స్థలాలను పరిశీలించిన అనంతరం అక్కడి మ్యాప్‌లను కూడా పరిశీలించారు. అక్కడి నుంచి నెల్లూరు రూరల్ పరిధిలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ.. కోవూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న స్థలాల పరిశీలన చేయడం జరిగిం దని, మిగతా ప్రాంతాల్లో కూడా పరిశీలన చేస్తారన్నారు. కోవూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, మహానాడు వంటి గొప్ప కార్యక్రమం ఇక్కడ జరిగితే అది ఈ నియోజకవర్గ అభివృద్ధికి మరింత బలం ఇస్తుందన్నారు. కోవూరు ఎంపికైతే అది తమ అదృష్టంగా భావిస్తామన్నారు.

# పెన్సిల్ ఆర్ట్‌తో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు చిత్రం శుభాకాంక్షలతో సోమా పద్మా రత్నం




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాలలో గత సంవత్సరం కంటే ఎంతో మెరుగైన ఫలితాలను సాధించారు. ఇందుకు ప్రత్యేకంగా మన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎడ్యుకేషన్ శాఖలోని అధికారులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు సమిష్టి కృషితో సాధించడం జరిగింది ప్రత్యేకంగా మంత్రి ప్రవేశపెట్టిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక బ్రహ్మాండమైన రిజల్ట్స్‌కు కారణమైందని ఈ సందర్భంగా ఎంతో సంతోషించు తగిన విజయం ఈ సంవత్సరం దాదాపు గత సంవత్సరంలోనే 81% అంటే ఈ సంవత్సరం 86% అధికంగావడం చాలా సంతోషించదగిన విషయం. ఈ ప్రణాళికలో వంద రోజులలో అనేక రకాలైన స్లిప్ టెస్ట్‌లు పెట్టడం వాటిని దిద్దడడం షైనింగ్ స్టార్స్ రైజింగ్ స్టార్స్ అంటూ రెండు భాగాలుగా చేసి ప్రత్యేక పర్యవేక్షణలో చదివిస్తూ ఎప్పటికప్పుడు ఆ మార్కులను నమోదు చేస్తూ వాటిని సంబంధిత అధికారులు గమనిస్తూ తగిన సలహాలు ఇస్తూ ప్రత్యేకంగా ప్రశ్నాపత్రాలు తయారు చేసి స్లిప్ టెస్టులతో పాటు గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహించడం ఇలా సులభంగా ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా విద్యార్థిని విద్యార్థులు చదివినట్లుగా ప్రశాంత వాతావరణంలో మంచి మాటలతో ఉపాధ్యాయుల కృషితో విద్యార్థిని విద్యార్థులు పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వం యొక్క అండతో మన మంత్రి పర్యవేక్షణతో ఈ యొక్క ఫలితాలను ఇంత ఘనంగా సాధించడం జరిగినది శుభాకాంక్షలు

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం పేదలకు వరం



**శ్రీకాళహస్తి టౌన్, (రాజధాని వార్తలు):** బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ప్రతినెల 1వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు పేదలకు ఇచ్చిన హామీ మేరకు 2700 కోట్ల రూపాయలు 64 లక్షలు మంది పేదలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేస్తున్నడం జరుగు తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఎం.సుబ్బయ్య, జి దశరథ ఆచారి తెలిపారు. అందులో భాగంగా 8వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పేదల పింఛన్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఎం.సుబ్బయ్య, జి.దశరథ ఆచారి పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఢిల్లీ పాలనలో ఆప్ చెరగని ముద్ర!

ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు భారతీయ జనతా పార్టీలోకి ఫిరాయించడం మూడు రకాల ప్రతిస్పందనలను పురిగొల్పింది. మొదటిది- ఫిరాయింపుదారులపై ఏహ్యత. వారు సిగ్గూ శరమూ లేని అవకాశవాదులు అనే ఈసడింపు బాగా వ్యక్తమయింది. రెండోది- ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను తప్పుపట్టడం. పార్టీలో సర్వాధినేతగా వెలిగిపోయేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని, అందులో భాగంగానే వ్యక్తిపూజను ప్రోత్సహిస్తున్నారని, తత్కారణంగా సమర్థులైన పలువురు నాయకులు ఆప్ నుంచి వెళ్లిపోవలసి వచ్చిందనే విమర్శలు వెల్లువెత్తాయి. మూడోది- వివేచనాపరులైన హిందుత్వ వ్యతిరేకులు ఎవరూ అసలు ఆప్‌కు ఓటు వేయరనే అనే వాదనను ముందుకు తీసుకువచ్చింది. ఆప్ ఆవిర్భావానికి దారి తీసిన అవినీతి నిర్మూలనా ఉద్యమం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మద్దతుతోనే జరిగినందున ఆప్‌ను సమర్థించడమేమిటని ఆ వాదన చేస్తున్నవారు ప్రశ్నిస్తున్నారు. అరవింద్ కేజ్రీవాల్ పదే పదే తానూ హిందూ మతస్థుడినేనని బహిరంగంగా చాటుకోవడాన్ని కూడా వారు ప్రశ్నిస్తున్నారు. మత వివక్షకు వ్యతిరేకంగా ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో రోజుల తరబడి శాంతియుతంగా నిరసన తెలిపిన మహిళలకు.. కేజ్రీవాల్ సంఘీభావం తెలుపకపోవడాన్ని కూడా పలువురు ఆక్షేపించారు. ఈ విమర్శలు అన్నిటిలోనూ సమంజసత్వమున్నది, సందేహం లేదు. నైతిక విశ్వాసాలు, భావజాల నిబద్ధతతో కాకుండా ఆర్థిక ప్రలోభాలు, అవినీతి ఆరోపణలపై సంభావ్య దర్యాప్తులకు భయపడే ఈ ఫిరాయింపులు జరిగాయనేది స్పష్టం. ఆప్ విపత్కర పరిస్థితి ఈ వ్యాస రచయితకు ఒక విధమైన విచారాన్ని కలిగిస్తోంది. ఆలోచనాత్మకమైన విచారమది. ఆప్ తన పదమూడు సంవత్సరాలకు పైగా అస్తిత్వంలో భారత ప్రజాస్వామ్యాన్ని ప్రగాఢం చేసే మేలు పనులు కొన్ని చేసింది. ఇది విస్మరించకూడని వాస్తవం. ఆప్‌ను ప్రశంసించేందుకు మరొక ప్రముఖ కారణం కూడా ఉన్నది. ఢిల్లీలో అధికారంలో ఉండగా పాలనా వ్యవహారాలలో ఆ పార్టీ ప్రభుత్వం అమలుపరచిన సంస్కరణలు. పాఠశాల విద్యలో ఆ ప్రభుత్వం తీసుకు వచ్చిన మార్పులను నేను ప్రత్యేకంగా ప్రస్తావించదలిచాను. 2015లో ఆప్ అధికారంలోకి వచ్చిన వెంటనే పాఠశాల విద్యారంగానికి నిధుల కేటాయింపును ఇతోధికంగా పెంచింది. ప్రభుత్వ పాఠశాలలోని సదుపాయాలను మెరుగుపరిచేందుకు పూనుకుంది. కొత్త పాఠశాలల నేర్పాటు చేసింది. ఉన్న పాఠశాలలకు కొత్త భవనాలు నిర్మించింది. తరగతి గదుల్లో బోధనా సదుపాయాలను నవీకరణ చేసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సహేతుకంగా మరిన్ని అధికారాలు కల్పించింది. వారు తమ విచక్షణ ప్రకారం వినియోగించేందుకు నిధులు సమకూర్చింది. విద్యాశాఖ అధికారులపై ఆధారపడకుండా స్వతంత్రంగా వ్యవహరించే వెసులుబాటును ప్రధానోపాధ్యాయులకు కల్పించింది. ప్రభుత్వ పాఠశాలలకు మరింత స్వతంత్ర ప్రతిపత్తిని సమకూర్చడంతో పాటు అభ్యసన ఫలితాలు బాగా మెరుగుపడేలా ఉపాధ్యాయులకు ప్రేరణ కలిగించడమే ఆప్ ప్రభుత్వ విద్యా సంస్కరణల లక్ష్యం. 'బాల బాలికలందరికీ పఠనం, లేఖనం, అంకగణితంలో గట్టి పునాదులు నిర్మించడమే లక్ష్యంగా బోధనా కార్యక్రమాలను రూపొందించారని' యామినీ అయ్యర్ తన పరిశోధనా గ్రంథంలో రాశారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు బాలల అభ్యసన స్థాయిని బట్టి తరగతులను మూడు విధాలుగా పునర్వ్యవస్థీకరించారు. కొత్తగా రూపొందించిన బోధనా కార్యక్రమాలను అమలుపరిచేందుకు మెంటార్ టీచర్లు అనే కొత్త ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ఎంపిక చేసి నియమించారు. వేసవి సెలవుల్లో బాలలకు పుస్తక పఠన మేళాలు నిర్వహించారు. కొత్త పాఠ్య పుస్తకాలను రూపొందించారు. జీవిత సత్యాలను బోధించే కథల ఆధారిత 'హ్యాపీనెస్ కరిక్యులమ్'ను రూపొందించి అమలుపరిచారు. ఈ పాఠాలపై విద్యార్థుల సామూహిక చర్చలను ప్రోత్సహించారు. ఆప్ అధికారంలోకి వచ్చిననాటికి ఢిల్లీలో ప్రభుత్వ పాఠశాల విద్యారంగం పూర్తిగా భ్రష్టు పట్టిపోయి ఉందని, అయినా దానిని కొత్త దిశలో మెరుగ్గా ముందుకు నడిపించడంలో ఆప్ సర్కార్ సఫలమైందని యామిని ప్రశంసించారు. ఈ సంస్కరణల సాఫల్యానికి ప్రధాన కారకుడు విద్యామంత్రి మనీష్ సిసోడియా. విద్యారంగంపై సిసోడియా దృక్పథంలో నాలుగు విశిష్ట గుణాలు ఉన్నాయని ఆయనతో కలిసి పనిచేసిన విద్యావేత్త ఒకరు నాకు చెప్పారు. వాటిలో మొదటిది-- ఉపాధ్యాయుల పట్ల గౌరవ భావం; బోధనా వృత్తి ప్రాముఖ్యత, పవిత్రత పట్ల సంపూర్ణ అవగాహన. రెండోది- పాఠశాలలు, తల్లిదండ్రుల మధ్య ప్రగాఢ సంబంధాలను పెంపొందించేందుకు సిసోడియా ఇచ్చిన అగ్ర ప్రాధాన్యం. మూడోది- బాలల అభ్యసనంపై దృష్టిని కేంద్రీకరించాలని పాఠశాలలను ప్రేరేపించడం. చదువులో వెనుకబడినవారికి అవకాశాలు కల్పించి వారి ఎదుగుదలకు తోడ్పడాలని ఉపాధ్యాయులకు పదే పదే చెప్పేవారు. నాల్గవది- పాఠ్య ప్రణాళికలను, సమస్త విద్యాబోధన ప్రక్రియను మానవతా దృక్కోణంలో రూపొందించేందుకు సిసోడియా నిరంతర కృషి. విద్య పట్ల ఆయన దృక్పథం ప్రజా కేంద్రితమైనది. పాఠశాల వ్యవస్థతో ప్రమేయమున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, బాలల శ్రేయస్సుకు అగ్ర ప్రాధాన్యమిచ్చేది. సిసోడియాలోని మరొక విలక్షణతను కూడా నేను ప్రస్తావించదలుచుకున్నాను. అది: వినయశీల ఉత్సుకత. విద్వజ్ఞులు, విద్యారంగంలో కృషి చేస్తున్న ఎన్జీఓలు చెప్పే విషయాలను శ్రద్ధగా విని, పరిస్థితులను మెరుగుపరిచేందుకు వారి సలహాలు తీసుకుని పాటించడమనేది మన రాజకీయవేత్తలలో చాలా అరుదు. ఇటువంటి విశిష్ట గుణం సిసోడియాలో ఉన్నది. ఆయన అందరికీ అందుబాటులో ఉంటారు. ఎటువంటి భేషజాలకు పోకుండా ఎదుటివారు చెప్పేది శ్రద్ధగా వింటారు. తగిన రీతిలో నిర్ణయాలు తీసుకుంటారు.

# సింహాద్రినాథుడికి వైభవంగా రెండో విడత చందన సమర్పణ

### - వైశాఖ పౌర్ణమి సందర్భంగా సింహగిరి భక్తజన సంద్రం

### - చందనోత్సవం తరహాలోనే తరలి వచ్చిన భక్తులు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రపంచంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరహాలక్ష్మీ నృసింహస్వామికి వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని రెండో విడతగా మూడు మనుగులు చందనాన్ని అత్యంత వైభవంగా సమర్పించారు. శుక్రవారం తెల్లవారుజామున సాంప్రదాయ పూజాది కార్యక్రమాలు పూర్తి చేసిన అనంతరం వేదమంత్రాలు మృదు మదుర మంగళ వాయిద్యాలు నడుమ చందన సమర్పణ గావించారు.

ఇక వైశాఖ పౌర్ణమి నేపథ్యంలో పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులతో సింహగిరి చందనోత్సవం తరహాలోనే భక్తజనసంద్రంగా మారింది ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. కొండ దిగున వరాహ పుష్కరిణి ప్రాంతం వద్ద కూడా వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆ దేవదేవుడు సింహాద్రినాథుడుని శుక్రవారం అప్పన్న ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులు జాతీయ జర్నలిస్టు సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు డాక్ యార్డ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు దర్శించుకున్నారు స్వామి సేవలో పాల్గొని తరించారు.

# ఎనిమిది గంటల పని దిన హక్కు కోసం ప్రతిఘటనా పోరాటం తప్పదు

### - ఏఐటీయూసీ నేత డాక్టర్ బూసి హెచ్చరిక

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** 140 ఏళ్ల క్రితం కార్మికుల రక్త తర్పణతో సాధించుకున్న 8 గంటల పని హక్కు రక్షణ కోసం ప్రతిఘటనా పోరాటానికి సిద్ధం అని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు డాక్టర్ బూసి వెంకటరావు హెచ్చరించారు. మేడే సందర్భంగా స్టీలు ప్లాంటు లేబర్ గేటు వద్ద జరిగిన పతాకా విష్కరణలో పాల్గొన్న వెంకటరావు మాట్లాడుతూ బ్రిటీష్ ఇండియా వైశ్రాయ్ ప్రభుత్వంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబెర్ గా ఎన్నికైన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 1942 నవంబర్ 27, 28 తేదీల్లో జరిగిన మొదటి లేబర్ కాన్ఫరెన్స్‌లో 8 గంటల పని దినశీ కోసం చట్టం చేశారని గుర్తు చేశారు. ఇండియాలో చట్టబద్ధంగా 85 ఏళ్లుగా అమలవుతున్న 8 గంటల పని హక్కును నేడు మోడీ ప్రభుత్వం తెచ్చిన కోడ్ ఆన్ ఆక్యుపెషనల్ సేఫ్టీ అండ్ హెల్త్ 2000 సెక్షన్ 25 ప్రకారం కార్మికులతో 10 నుండి 12 గంటలు పని చేయించుకోవచ్చని మార్పు చేసి కార్మికుల పోరాడి




సాధించుకున్న 8 గంటల పని హక్కును కాలరాసిందని దుయ్యబట్టారు. తిరిగి లేబర్ కోడ్స్ రద్దు ద్వారా కార్మిచట్టాల పునరుద్ధరణతో 8 గంటల పని హక్కు కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జీ తిరుపతి రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బూస అప్పల రెడ్డి, సన్యాసి రావు, విజయ్ కుమార్, సాయి, బెహరా తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఏకాగ్రత కలిగి ఉండాలి

### - విలు విద్య సమ్మర్ కోచింగ్ క్యాంపు 2026 ను ప్రారంభించిన కలెక్టర్ మహేష్ కుమార్





**అమలాపురం, (రాజధాని వార్తలు):** యువతకు, క్రీడా కారులకు క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా క్రమ శిక్షణ, ఏకాగ్రతకు మార్గదర్శకమని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు.ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయ అనుబంధ కళాశాలగా ఉన్న కామన గరుగు చల్లపల్లి రోడ్‌లో ఉన్న 'ది అమలాపురం కళాశాల వద్ద స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సాయి విలువిద్య సంస్థ వారి ద్వారా విలు విద్య సమ్మర్ కోచింగ్ క్యాంపు 2026ను జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువిద్యలో నవశకాన్ని తీసుకొచ్చే దిశగా శాప్ క్రీడల వేదికగా సరికొత్త అడుగు పడిందన్నారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం శాప్ ద్వారా క్రీడా రంగానికి పెద్దపీట వేస్తూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు 'నవశకం' పేరుతో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ముఖ్యంగా మన సంస్కృతిలో భాగమైన విలువిద్య (ఆచరి) క్రీడలో మన జిల్లా యువతకు అపారమైన ప్రతిభ ఉందని ఈ ప్రతి భను అంతర్జాతీయ స్థాయికి చేర్చడమే ఈ క్రీడా పోటీల ప్రధాన లక్ష్యమన్నారు. తద్వారా గ్రామీణ ప్రతిభకు గుర్తింపు లభిస్తుందన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న సహజ సిద్ధమైన విలువిద్య క్రీడాకారులను గుర్తించి వారికి సరైన వేదికను కల్పించడం జరిగిందన్నారు. శాప్ ఆధ్వర్యంలో అత్యాధునిక విల్లులు మరియు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణను అందించడం ద్వారా క్రీడాకారులను అన్ని విధాల ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన ద్వారా, జిల్లాలో ప్రత్యేక విలు విద్య శిక్షణ కేంద్రాలను బలోపేతం చేయాలన్నారు.ఏకాగ్రత సాధన ఈ క్రీడకు అత్యంత అవసరమన్నారు.

విద్య అనేది కేవలం గురి పెట్టడం మాత్రమే కాదని మనస్సును, ఏకాగ్రతను అదుపులో ఉంచుకునే కళ అన్నారు. విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంచి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు స్పోర్ట్స్ సిబ్బంది పాటుపడాలన్నారు. గురి చూసి బాణాన్ని వదిలి నట్లుగా యువత జీవిత ఆశయాల పట్ల స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగాలన్నారు. విలువిద్యలో నైపుణ్యం సాధించి కోనసీమ జిల్లా కీర్తిని రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులను కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగుతూ విజయపథంలో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్డివో రుద్ర, విలువిద్య అధ్యక్షులు గోపాలకృష్ణ, కోచ్ డి సాయిబాబా స్థానిక తాసిల్దార్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ హయాంలో చిగురించిన సొంతింటి కలను చిదిమేసిన చంద్రబాబు సర్కార్ : జమ్మలమడక

### - అమరావతి పేదలపై కూటమి ప్రభుత్వ కర్కశత్వం



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించిన గృహ యోజనలను ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 33 లక్షలకు పైగా లబ్ధిదారులకు ఇంటి స్థలాలు కేటాయించారని గుర్తుచేశారు. అయితే, తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో అమరావతిలోని ఆర్-5 జోన్‌లో పేదలకు కేటాయించిన భూములను సీఆర్డీఏ పరిధిలో విలీనం చేయడం వల్ల వేలాది కుటుంబాల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో సుమారు 50 వేల మంది పేదలు తమకు కేటాయించిన స్థలాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. పేదలకు అమరావతిలో స్థానం ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. అమరావతి అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని, అదే సమయంలో వైద్య రంగానికి, ఆరోగ్య సేవలకు సరైన నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. ముఖ్యంగా అమరావతిలో గ్లాస్ ఫినిషింగ్ పనుల కోసం రూ. 2,540 కోట్లు మంజూరు చేయడాన్ని ఆమె తప్పుబట్టారు. తెలంగాణలో రూ. 650 కోట్లతో అసెంబ్లీ భవనం నిర్మాణం జరుగుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో తాత్కాలిక భవనాలకే అంతకంటే ఎక్కువ ఖర్చు చేయడం ఆశ్చర్యకరమని అన్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని చెప్పే ప్రభుత్వం ఉద్యోగుల జీతాలు సకాలంలో చెల్లించడంలో విఫలమవుతోందని నాగమణి విమర్శించారు.

## సాంప్రదాయాలకు ప్రతిబింబాలు జాతరలు : డీసీసీబీ చైర్మన్ ప్రత్యేక పూజలు




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సాంప్రదాయాలకు ప్రతిబింబాలుగా అమ్మవారి జాతరలు జరుగుతాయని వాటిని ప్రజలంతా గౌరవించాలని డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. సామర్లకోట మండలం గొంచాల గ్రామంలో గ్రామ దేవత అయిన శ్రీ శ్యామలాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ జాతర ఉత్సవాల్లో కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారి ఆలయంలో తొలుత ఆయన సంప్రదాయ పద్ధతుల్లో పూజలు చేసి, గ్రామ ప్రజల సుఖశాంతి, ఆయురారోగ్యాలు, అభివృద్ధి జరగాలని కాంక్షించారు. ఈ జాతర మహోత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ గ్రామ దేవతల జాతరలు మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతిబింబమని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో ఐక్యతను, భక్తిభావాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జనసేన పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్‌గా ఫణి కిరణ్‌కు పదోన్నతి.. రంగరాయలో బాధ్యతల స్వీకరణ

**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న డాక్టర్ ఫణి కిరణ్‌కు ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి సౌరబ్ గౌర్ ఈ నెల 29న ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి అనంతరం రంగరాయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ విభాగంలో ప్రొఫెసర్‌గా డాక్టర్ ఫణి కిరణ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ ఏ.విశివర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, పలువురు ప్రొఫెసర్లు, వైద్య సిబ్బంది డాక్టర్ ఫణి కిరణ్‌ను అభినందించారు.

# సల్మాన్ ఖాన్‌తో సమంతకు ఛాన్స్!





సల్మాన్ ఖాన్ - సమంత ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే ఎలా ఉంటుంది? ఈ ఊహే ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక్కసారిగా అంచనాలను పెంచేస్తోంది. సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా రాజ్ అండ్ డీకే ఓ సూపర్ హీరో చిత్రాన్ని ప్లాన్ చేస్తు న్నారు. ఇప్పటికే కథ వినిపించగా? సల్మాన్ ఒకే చేసారు. అయితే ఆ కథలో కొన్ని మార్పులను సూచించారు. వాటన్నింటి పూర్తి చేసి పట్టాలెక్కించాలని దర్శకద్వయం ప్లాన్ చేస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో కథానాయికగా సమంతను ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇదే నిజమైతే సమంతకు బాలీవుడ్‌లో బిగ్గెస్ట్ ఎంట్రీ ఇదే అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. సమంతకు, రాజ్ అండ్ డీకేలకు మధ్య మంచి అనుబంధం ఉంది. వీరి దర్శకత్వంలో రిలీజ్ అయిన ది ఫ్యామిలీ మ్యాన్ 2 వెబ్ సిరీస్‌తో సమంత నేషనల్ వైడ్‌గా గుర్తింపు తెచ్చుకుంది. రాజీ పాత్రలో సమంత నటనకు బాలీవుడ్ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అటుపై వీరితోనే కలిసి సిటాడెల్: హనీ బన్నీ అనే మర భారీ సిరీస్‌లో నటించిన సంగతి తెలిసిందే. సమంతలోని నటన, డెడికేషన్ దర్శక ద్వయానికి బాగా నచ్చింది. ఈ నేపథ్యంలో సమంత రాజ్ నిడిమోరుతో మరింత స్నేహాన్ని కొనసాగించి పెళ్లి వరకూ తీసుకెళ్లింది. ఇటీవలే వాళ్లిద్దరు పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో సమంతను కాదని రాజ్ నిడిమోరు మరో నాయిక వైపు ఎలా చూస్తాడు? సమంత బాలీవుడ్‌లో సినిమాల్లో నటించాలని ఎప్పటి నుంచో ఆశపడుతోంది. ఎన్నో ప్రయత్నాలు కూడా చేసింది. కానీ ఎవరు అవకాశం ఇవ్వలేదు.

సమంత కంటే వెనకెళ్లిన వాళ్లకు అవకాశాలు వచ్చాయిగానీ సామ్‌కి మాత్రం ఛాన్స్ రాలేదు. ఈనేపథ్యంలో భర్త డైరెక్ట్ చేసే సినిమాలోనైనా సామ్ ఛాన్స్ అందుకోకపోతే ఎలా అన్న చర్చ జోరుగా సాగుతోంది. సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు గ్లామర్‌కే పరిమితం కాకుండా ప్రాధాన్యత ఉండేలా రాజ్ అండ్ డీకే కథను సిద్ధం చేస్తుంటారు. సమంతకు బాలీవుడ్‌లో బాలీవుడ్‌లో ఇప్పుడిప్పుడే మొదలైన క్రేజ్ నేపథ్యంలో సల్మాన్‌లాంటి సూపర్ స్టార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం సామ్ కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్తుంది. సౌత్ భామలు హిందీలో జెండా పాతేస్తున్న సమయంలో సమంత-సల్మాన్ కాంబో ట్రేడ్ వర్గాల్లో కూడా హాట్ టాపిక్‌గా మారనుంది. ఈ ప్రాజెక్ట్ గనుక పట్టాలెక్కితే ప్రేక్షకులకు అద్భుతమైన విజువల్ ట్రీట్ దక్కినట్లే. రాజ్ అండ్ డీకే స్టైల్ స్టోరీ టెల్లింగ్‌లో సల్మాన్ స్వాగ్, సమంత పర్ఫార్మెన్స్ చూడాలని అభిమానులు అంతే ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# కథల ఎంపికలో కన్నడ భామలిద్దరు ఒకేలా!






ప్రస్తుతం దక్షిణాది చిత్ర పరిశ్రమలో కన్నడ భామల హవా నడుస్తోంది. నేషనల్ క్రష్ రష్మిక మందన్నా, లేటెస్ట్ సెన్సేషన్ రుక్మిణి వసంత్ తమకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఇద్దరు కన్నడ అందగత్తెలు సినిమాల ఎంపిక విషయంలో దాదాపు ఒకే విధమైన సూత్రాలను పాటిస్తున్నారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న కథలను ఎంచుకోవడంలో ఇద్దరు ఒకే ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. రష్మిక మందన్నా కెరీర్ ప్రారంభం నుండి చూస్తే స్టార్ హీరోల కే పరిమితం కాకుండా పాత్రకు ప్రాముఖ్యత ఉన్న చిత్రాలను ఎంచుకుంటూ వచ్చింది. కిరాక్ పార్టీతో మొదలైన అమ్మడి ప్రయాణం పుష్ప, యానిమల్ వంటి భారీ చిత్రాల వరకు చేరింది. అయితే రష్మిక పాత్రలో వైవిధ్యం ఉంటేనే సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. రెండు పాటలు, మూడు సీన్ల కోసం సినిమాలు చేయనని గతంలోనే స్పష్టం చేసింది. ఈ క్లారిటీనే ఆమెను నేడు పాన్-ఇండియా స్టార్‌గా నిలబెట్టింది. ముందుగా కథ, ఆ తర్వాత పాత్ర లోతును పూర్తిగా స్టడీ చేసిన తర్వాతే ఏ సినిమాకైనా సైన్ చేస్తుంది. అలాగే కాంతార2 తో సౌత్‌లో ఫేమస్ అయిన రుక్మిణి వసంత్ కూడా ఇదే బాటలో పయనిస్తోంది. ఆమెకు టాలీవుడ్‌లో వరుస ఆఫర్లు వస్తున్నా ఆచితూచి అడుగులు వేస్తోంది. తాజాగా రవితేజ సరసన ఓ ప్రాజెక్ట్‌కు సంతకం చేసినట్లు వార్తలొస్తున్నాయి. ఆమె ప్రధానంగా కథా బలమున్న చిత్రాలకే మొగ్గు చూపుతోంది. బలమైన పాత్ర కాకపోతే ఎంత రెమ్యునరేషన్ ఆఫర్ చేసినా నో చెప్పడానికి రుక్మిణి వెనుకాడటం లేదని ఇండస్ట్రీ టాక్. ఎన్టీఆర్ సరసన డ్రాగన్‌లో నటిస్తున్నా ఆ సినిమాలో అమ్మడి పాత్రకు ప్రాధాన్యత ఉందని తెలిసింది. ఇద్దరు భామల ఎంపికల్లో కనిపిస్తోన్న మరో పాయింట్ ఎమోషనల్ కనెక్ట్. ప్రేక్షకులు తమ పాత్రతో కనెక్ట్ అయ్యేలా ఉండే కథలనే ఎక్కువగా ఇష్ట పడుతున్నారు. రష్మిక శ్రీవల్లిగా ఎంతగా మాస్ ఆడియన్స్‌ను మెప్పించిందో గీత గోవిందంలో అంత క్లాస్ లుక్‌లో అలరించింది. రుక్మిణి కూడా సహజసిద్ధమైన నటనతో హోమ్లీ ఇమేజ్‌ను కాపాడుకుంటూనే? నవతరం ప్రేక్షకులకు నచ్చే పాత్రలను ఎంచుకుంటోంది. కథ వినేటప్పుడే పాత్ర గ్రాఫ్ ఎలా ఉందో క్షుణ్ణంగా పరిశీలించడం ఇద్దరిలో మరో కామన్ పాయింట్. ప్రస్తుతం పరిశ్రమలో పోటీని తట్టుకుని నిలబడాలంటే అందం మాత్రమే సరిపోదని సరైన కథలను ఎంచుకునే విజ్ఞత ఉండాలని ఇరువురు బలంగా నమ్ముతున్నారు. రష్మిక తెలుగు సినిమాలతో హిందీ చిత్రాల్లోనూ నటిస్తోన్న సంగతి తెలిసిందే. కమర్షియల్ కథలతో పాటు లేడీ ఓరియేంటెడ్ కథలను ఒకే చేస్తూ ముందుకెళ్తుంది. రుక్మిణి వసంత్ కన్నడతో పాటు తమిళ, తెలుగు చిత్రాల్లో తన ముద్ర వేయడానికి సిద్ధమవుతోంది. ఇద్దరి కెరీర్ గ్రాఫ్ చూస్తుంటే పక్కా ప్లానింగ్‌తో లాంగ్ రన్ ఉండాలనే లక్ష్యంతో కొన్ని రూల్స్ పెట్టుకునే ముందు కెళ్తున్నట్లు కనిపిస్తోంది.

# సతీ లీలావతి అన్ని వర్గాలకు వినోదం పంచే సినిమా



మెగా కోడలు లావణ్య త్రిపాఠి కొణిదెల - దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం సతీ లీలావతి మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో, దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. 'భీమిలీ కబడ్డీ జట్టు', 'ఎస్ఎంఎస్' వంటి చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిని ఏర్పరచుకున్న తాతినేని సత్య ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శనివారం జరిగిన వేడుకలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఈ మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేసి చిత్ర యూనిట్‌కు అండగా నిలిచారు. ఈ సందర్భంగా నిర్మాత నాగమోహన్ మాట్లాడుతూ.. సతీ లీలావతి అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే కంటెంట్‌తో రూపొందిందని ధీమా వ్యక్తం చేశారు. షూటింగ్ ప్రారంభం నుండి ప్రమోషన్ల వరకు సహకరించిన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ అందించిన సహకారం వల్లనే సినిమాను అనుకున్న సమయానికి, అత్యున్నత నాణ్యతతో ప్రేక్షకుల ముందుకు తీసుకు రాగలిగామని ఆయన పేర్కొన్నారు. రామ్ చరణ్ ట్రైలర్‌ను రిలీజ్ చేయడం సినిమా స్థాయిని పెంచిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అన్ని వర్గాలకు వినోదం పంచే సినిమా ఇదని తెలిపారు. దర్శకుడు తాతినేని సత్య మాట్లాడుతూ.. రామ్‌చరణ్ ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. రైటింగ్ విభాగంలో ఉదయ్ అందించిన సహకారం, అలాగే డైరెక్షన్ టీం పడ్డ కష్టం తెరపై స్పష్టంగా కనిపిస్తుందని ఆయన అన్నారు. మే 8న థియేటర్లకు వచ్చే ప్రేక్షకులకు ఈ సినిమా ఒక మంచి అనుభూతిని ఇస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని చూసి ఆశీర్వదించాలని కోరారు. 'సతీ లీలావతి' చిత్రంలో హాస్యం, భావోద్వేగాలు సమపాళ్లలో ఉంటాయని ఆయన వివరించారు. చిత్ర కథానాయకుడు దేవ్ మోహన్ మాట్లాడుతూ,.. తెలుగు ప్రేక్షకుల ముందుకు మళ్ళీ రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సినిమాలో తాను పోషించిన పాత్ర చాలా వైవిధ్యంగా, కొత్తగా ఉంటుందని వెల్లడించారు. లావణ్య త్రిపాఠితో కలిసి నటించడం ఒక గొప్ప అనుభవమని, ట్రైలర్‌కు వస్తున్న స్పందన చూస్తుంటే సినిమా విజయంపై నమ్మకం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రామ్ చరణ్ ఈ చిత్రానికి పూర్తి స్థాయిలో మద్దతు తెలుపుతూ, లావణ్య త్రిపాఠి నటనలో చాలా సహజంగా కామెడీ పండించిందని ప్రశంసించడం విశేషం. మరోవైపు ఈ చిత్రాన్ని పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కోసం ప్రత్యేకంగా ఒక ఫ్యామిలీ షో వేయాలని ప్లాన్ చేస్తున్నట్లు లావణ్య త్రిపాఠి ప్రకటించారు. మెగా కుటుంబ సభ్యుల అండదండలతో వస్తున్న సతీ లీలావతి బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి వినోదాన్ని పంచుతుందో చూడాలి.

# ఎలక్షన్స్ రిజల్ట్స్ వేళ త్రిష ఊహించని పోస్ట్



దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఎవర్ గ్రీన్ బ్యూటీగా వెలిగిపోతున్న త్రిష, తాజాగా సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. తమిళనాడు ఎలక్షన్ రిజల్ట్స్ హడావిడి ఒకవైపు, త్రిష పుట్టిన రోజు వేడుకలు మరోవైపు ఉండటంతో అభిమానుల్లో జోష్ నెలకొంది. ఇంస్టాగ్రామ్‌లో ఆమె పెట్టిన క్యాప్షన్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. అసలు త్రిష ఈ పోస్ట్ వెనుక ఉన్న అంతరార్థం ఏంటి ఆమె అప్ కమింగ్ సినిమాలు ఏంటో ఇప్పుడు చూద్దాం. సాధారణంగా మే నెల వచ్చిందంటే ఎండల వేడి గుర్తొస్తుంది. కానీ త్రిషకు మాత్రం ఇది తన సొంత సీజన్. మే 4వ తేదీన త్రిష పుట్టినరోజు కావడంతో, తన బర్త్ డే సెలబ్రేషన్స్ మొదలయ్యాయని చెబుతూ చాలా తెలివిగా "May(me)" అని పోస్ట్ చేశారు. అంటే మే నెల మరియు తనను (వీవ) కలిపి ఈ క్యాప్షన్ ఇచ్చారు. బ్లాక్ స్లీవ్‌లెస్ టాప్, జీన్స్‌లో త్రిష కనిపిస్తున్న ఈ స్టైలిష్ లుక్ చూసి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. త్రిష సినిమాల విషయా నికి వస్తే, చాలా కాలం తర్వాత సూర్యతో కలిసి ఆమె నటించిన 'కరుప్పు' చిత్రం మే 14న విడుదలకు సిద్ధమవుతోంది. తెలుగులో ఈ సినిమా 'వీరభద్రుడు' పేరుతో వస్తోంది. తాజాగా ఈ సినిమా నుండి త్రిష పోషిస్తున్న 'ప్రీతి' పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇక ఇందులో ఆమె లాయర్ కోటు వేసుకుని చాలా గంభీరంగా, చీరకట్టులో ఎంతో పద్ధతిగా కనిపిస్తూ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేసింది. సూర్య, త్రిష జంట అంటే సినీ ప్రేమికులకు ఒక ప్రత్యేకమైన క్రేజ్. దాదాపు 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో వీరు మళ్లీ కలిసి నటిస్తుండటంతో 'వీరభద్రుడు' సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయ్యింది.

ఈ సినిమాతో పాటు త్రిష చేతిలో మరిన్ని సెన్సేషనల్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇక మెగాస్టార్ చిరంజీవితో 'విశ్వంభర', మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్‌తో 'రామ్' చిత్రాల్లో ఆమె నటిస్తూ బిజీగా గడుపుతోంది. తమిళనాడు ఎన్నికల ఫలితాల ఉత్కంఠ మధ్య త్రిష పుట్టినరోజు రావడం విశేషం. వివాదాలు ఏవైనా సరే, కెరీర్ పరంగా మాత్రం త్రిష ప్రస్తుతం గోల్డెన్ పీరియడ్ ఎంజాయ్ చేస్తోంది. అటు బర్త్ డే సెలబ్రేషన్స్, ఇటు వరుస భారీ సినిమాల విడుదలలతో ఈ మే నెల మొత్తం త్రిష నామస్మరణతో మారుమోగిపోనుంది. ఇక తన ఆత్మవిశ్వాసంతో, అందంతో మరోసారి సౌత్ ఇండియాను ఏలేందుకు ఈ చెన్నై చిన్నది సిద్ధమైపోయింది.

# మోడీ తెచ్చిన లేబర్ కోడ్‌లు రద్దు చేయకపోతే మరో చికాగో పోరాటం తప్పదు

## - 140వ మేడే వేడుకల్లో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బుగత అశోక్ హెచ్చరిక - విజయనగరం నగరంలో ఘనంగా 140వ మేడే ఉత్సవాలు - 20 చోట్ల ఎర్ర జెండాలు ఎగుర వేయడం అనంతరం 3 చోట్ల ర్యాలీలు

**విజయనగరం, (రాజధాని వార్తలు):** శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో బుగత అశోక్ నేతృత్వంలో సిపిఐ విజయనగరం నియోజకవర్గ పార్టీ కార్యాలయం దగ్గర 1 చోట, స్థానిక మర్క్స నగర్ (బుచ్చెన్న కోనేరు) శాఖలో 3 చోట్ల, బలిజివీధి శాఖలో 2 చోట్ల, శాంతినగర్ శాఖలో 1 చోట, విజయ నగరం కాల్ గ్యాస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దగ్గర 1 చోట, విజయనగరం పి.డబ్ల్యూ మార్కెట్ ఎంప్లాయిస్ అండ్ ముఠా వర్కర్స్ యూనియన్ శాఖలో 5 చోట్ల, టింబర్ జట్టు ముఠా వర్కర్స్ యూనియన్ దగ్గర 1 చోట, ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో ఫ్లోర్ మిల్లు దగ్గర 1 చోట, విజయనగరం గూడ్స్ & ట్రాన్స్పోర్ట్ ఆటో, ఫ్లాట్ఫామ్ రిక్షా ముఠా వర్కర్స్ యూనియన్ దగ్గర 1 చోట, జి. వి. ఆర్ దాల్ మిల్స్ ముఠా వర్కర్స్ యూనియన్ దగ్గర 1 చోట, విజయనగరం సిమెంట్ ముఠా వర్కర్స్ యూనియన్ దగ్గర 1 చోట, మహారాజా, ఘోషా ఆసుపత్రిల దగ్గర 2 చోట్ల మొత్తం 20 చోట్ల జరిగిన 140 వ మేడే దినోత్సవ వేడుకలు ఎర్ర జెండాలు ఎగురవేసి 3 చోట్ల ర్యాలీలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. అనంతరం బుగత అశోక్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ సంపద సృష్టికర్తలైన శ్రామిక జనావాళికి, చమటను దారభోస్తూ దేశప్రజలికి అన్నం పెడుతున్న రైతు కూలన్నలకి 140 వ మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచ కార్మిక దినోత్సవంగా మేడే ను 140 ఏళ్ళ క్రితం కార్మికుల రక్తం నుంచి పుట్టిన ఎర్ర జెండా శ్రామిక జన పోరాట పతాకాన్ని, 8 గంటల పనిదినాల కోసం అసువులు బాసిన కార్మిక అమరవీరులను స్మరించుకుంటూ కార్మిక పర్వదినంగా మేడేను జరుపుకుంటున్నామని అన్నారు. అమెరికా, యూరప్ దేశాలలో 19వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం కారణంగా స్థాపించబడిన భారీపరిశ్రమల్లో పనిచేయుటకు







కార్మికుల అవసరం ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి ఉత్పత్తిరంగంలోని పెట్టుబడిదారులు, కార్మికులు రెండు వర్గాలు పుట్టాయన్నారు. పెట్టుబడిదారులు అధిక లాభాల కోసం కార్మికుల శ్రమను దోచుకోవడం మొదలు పెట్టారన్నారు. శ్రామికులచే బానిసల్లా పనిచేయించేవారు. పిల్లలు మహిళలు అనే విచక్షణ లేకుండా కర్మాగారాలలో, గనులలో గొడ్డు చాకిరీ చేయించేవారని అశోక్ తెలియచేశారు. కనీస వసతులైన తిండి, బట్ట, గూడు వంటి ఉండేవి కాదని తెలిపారు. రోజుకు 18 నుంచి 20 గంటలు కార్మికుల చేత గొడ్డు చాకిరీ చేయించేవారని తెలిపారు. ఈ దారుణ చర్యల నేపథ్యంలో కార్మికులలో క్రమక్రమంగా తిరుగుబాటు మొదలైందన్నారు. గొడ్డు చాకిరీ చేయించుకుంటున్న పెట్టుబడిదారీ వర్గంపై ఉద్యమాలకు కార్మికులు సంఘటితమయ్యారు. ఆనాటి నుండి కార్మిక సంఘాల నిర్మాణం ప్రారంభించారన్నారు. 1764-1800 మధ్య బ్రిటన్‌లోనూ, ఆ తరువాత యూరప్‌లోనూ, ట్రేడ్ యూనియన్ల నిర్మాణం జరిగిందన్నారు. అమెరికాలోని ఫిలడెల్ఫియా నగరంలో కార్మికులు చైతన్యవంతులై 1806లో మెకానిక్స్ యూనియన్ పేరిట తొలి కార్మిక సంఘాన్ని స్థాపించుకొన్నారని తెలిపారు. పనిగంటలు తగ్గించాలని, న్యాయబద్ధంగా వేతనాలు చెల్లించాలని, కర్మాగారాలలో కనీస వసతులు కల్పించాలని, కోరుతూ కార్మిక వర్గం విప్లవ శంఖం పూరించిందన్నారు. ఆ పోరాట జ్వాలలు బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీ దేశాలకు, అమెరికాలోని మిగతా ప్రాంతాలకు వ్యాపించాయని అశోక్ తెలిపారు. ఫిలడెల్ఫియాలో మెకానిక్స్ యూనియన్ 1827లో తమకు 8 గంటల పనిదినం కోసం పోరాటం ప్రారంభించిందన్నారు. ఆ కార్మికోద్యమం దావాలంగా వ్యాపించి ఉధృతం కావడంతో ప్రభుత్వం దిగివచ్చి 1837లో 10 గంటల పనిదినంను చట్టబద్ధం చేసిందన్నారు. 1881లో చికాగో నగరంలో వివిధ కార్మిక సంఘాలు సంఘటితంగా అమెరికా ఫెడరేషన్ ఆఫ్ లేబర్ పేరిట ఒక సమాఖ్యను కొత్తగా ఏర్పాటు చేసుకున్నాయన్నారు. ఆ సమాఖ్య 1884 అక్టోబరు 7న 8 గంటల పనిదినంను చారిత్రాత్మక తీర్మానం చేసిందన్నారు. 1886 మే 1వ తేదీన కార్మిక వర్గం సమ్మె పోరాటం జరపాలని నిర్ణయించిందన్నారు. 1885-86లో మేడే సన్నద్ధతకు జరిగిన సమ్మె పోరాటాల్లో లక్షలాది కార్మికులు పాల్గొన్నారన్నారు. 1886లో జెనీవాలో జరిగిన మొదటి ఇంటర్‌నేషనల్ మహాసభ కూడా రోజుకు 8 గంటలు పనిని చట్టబద్ధం చేయాలని కోరిందన్నారు. 1886 మే 1వ తేదీన చికాగోలో 8 గంటల పనిదినం సమ్మె జరిగిందన్నారు. ఆ సమ్మెలో మూడున్నర లక్షల మంది కార్మికులు ప్రత్యక్షంగా పాల్గొన్నారని అన్నారు. దీంతో కార్మికులపై మే 3న ప్రభుత్వం కాల్పులు జరిపిందన్నారు. ఆ కాల్పుల్లో 8మంది కార్మికులు అమరులయ్యారన్నారు. కార్మిక ఉద్యమానికి నాయకత్వం వహించిన కార్మిక నాయకులను పట్టుకొని ఉరి తీశారని తెలిపారు. మే1న ప్రారంభమైన మహోద్యమం బాల్టిమెన్, న్యూయార్క్, వాషింగ్‌టన్, పిట్సు, డెట్రాన్ వంటి పెద్ద నగరాలకు దావానలంలా వ్యాపించింది. కార్మికుల హక్కుల కోసం వీరోచితంగా పోరాటాలు, త్యాగాలు చేశారన్నారు. 1889 లో సోషలిస్టు అంతర్జాతీయ మహాసభ రెండవ ఇంటర్‌నేషనల్ లో మే 1వ తేదీన ప్రపంచ కార్మిక దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. ఆ రోజున అన్ని దేశాలలోని కార్మికులు ఏకకాలంలో తమ కోర్కెలను ప్రకటించాలని ఆదేశించింది. 1890 మే 1వ తేదీన ఐరోపా దేశాలలో తొలిసారిగా మేడే జరపడం జరిగిందన్నారు. మనదేశంలో కార్మికుల జీవితాలకు సవాలుగా నిలిచిన మతతత్వం, నూతన ఆర్థిక సంస్కరణల ఫలితంగా బహుళజాతి సంస్థల శ్రమ దోపిడీ నుంచి కాపాడుకునేందుకు దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను, కార్మిక హొక్కులను రక్షించుకునేందుకు చికాగో నగర పోరాటాన్ని స్మరించుకుంటూ నేడు బీజేపీ అవలంభిస్తున్న ఆర్థిక, సామాజిక దోపిడీ విధానాల పై పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న చంద్రబాబు కూటమి ప్రభుత్వం లేబర్ కోడ్ లకి వ్యతిరేకంగా తీర్మానం చేయాలని లేని యెడల తీవ్రమైన కార్మిక ప్రతిఘటన చవిచూడాల్సి వస్తుందని బుగత అశోక్ హెచ్చరించారు. మేడే కార్యక్రమంలో అప్పరుబోతు జగన్నాధం, చిల్లా చిట్టిబాబు, బూర వాసు, వడ్డది కొండలరావు, పార్టీ శాఖా కార్యదర్శులు, యూనియన్ నాయకులు మరియు పట్టణంలో కార్మికులు పాల్గున్నారు.

# నిర్ధిష్టంగా పింఛన్ల పంపిణీ - అర్హులందరికీ లబ్ధి

## - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో పింఛన్ల పంపిణీ నిర్ధిష్టంగా ఒకటవ తేదీ ఉదయం నుంచి ప్రారంభం అయిందని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి తెలిపారు, పింఛన్లు పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా, సమయానికి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం గంట్యాడ మండలం నరవ గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి, వారికి అందుతున్న సౌకర్యాలు, సమస్యలను తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పింఛన్లు అర్హులైన ప్రతి ఒక్కరికి సకాలంలో చేరేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ఆలస్యం లేకుండా గ్రామస్థాయిలోనే పంపిణీ పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో మొత్తం 2,68,642 మంది లబ్ధిదారులకు రూ.114.92 కోట్ల పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పింఛన్ పంపిణీ కార్యక్రమం సజావుగా కొనసాగుతోందని, ఎక్కడైనా లోపాలు ఉన్నట్లయితే వెంటనే తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి శ్రీనివాస ఫణి, స్థానిక అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పుచ్చలపల్లి సుందరయ్య త్యాగాలు ఆదర్శనీయం

## - సుందరయ్య పుట్టిన గడ్డలో జయంతి సంబరాలు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి - పుచ్చలపల్లి సుందరయ్య చిత్ర పటానికి నివాళులు

**విడవలూరు, (రాజధాని వార్తలు):** ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య జయంతిని పురస్కరించుకొని స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సుందరయ్య చిత్ర పటానికి పూలమాలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలగానిపాడు గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించి సుందరయ్య చేసిన కార్మిక కర్షక సేవలను ఆమె కొనియాడారు. ఆయన త్యాగాలు అందరికీ ఆదర్శనీయమని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ అన్నారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా అలగానిపాడు గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్మికుల సంక్షేమం హక్కులు కోసం పోరాడి సాధించుకున్న రోజు మే డే అని గుర్తు చేశారు. భారతదేశం కార్మిక హక్కుల కోసం జీవితమంతా త్యాగం చేసిన మహనీయులు పుచ్చలపల్లి సుందరయ్య మే డే రోజునే పుట్టడం వారి ఆలోచనా విధానాలకు నిలువుటద్దమన్నారు. అలాంటి మహనీయుని సొంత గ్రామం అలగానిపాడులో ఆయన పుట్టిన ఇంట్లో శుక్రవారం 1న మే డే జరుపుకోవడం తనకు సంతోషంగా ఉందన్నారు. ఆయన ఆదర్శాన్ని స్పూర్తిగా తీసుకొని పని చేస్తామని, దివంగత నేత మాజీ సీఎం నందమూరి తారక రామారావు కార్మికులు, కర్షకులు కోసం పనిచేసే పార్టీ తెలుగుదేశం పార్టీ అని చెప్పి అందుకు గుర్తుగా పార్టీ జెండాలోనే బండి చక్రం, నాగలి గుడిసె గుర్తుగా పెట్టడం జరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఎన్‌టీఆర్ ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను కొనసాగిస్తూ నిరంతరం కార్మికులు, కూలీలు, అసంఘటిత రంగాల్లో ఉన్న కార్మికుల కోసం ప్రత్యేక సంస్కరణలు తీసుకువచ్చి పనిచేశారన్నారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రత్యేక పథకాలను ప్రకటించిందన్నారు. అందుకు సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలం అధ్యక్షులు ఏటూరు హరిరెడ్డి, రాష్ట్ర టీడీపీ నేత చెముకుల కృష్ణ చైతన్య, మాజీ మండలం అధ్యక్షులు చెముకులు శ్రీనివాసులు.బెజవాడ వంశీ కృష్ణ రెడ్డి, స్థానిక గ్రామం టీడీపీ నేతలు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నందు ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో మేడే కార్యక్రమము ఘనంగా నిర్వహించడమైనది ఈ మేడే కార్యక్రమంలో ఏసీ స్టేడియంలోని 16 మంది శ్రామికులకు సన్మానము మరియు క్యాష్ అవార్డు ఆర్‌సి పలగాటి శ్రీనివాసులు రెడ్డి ఇంద్ర డోనర్ సౌజన్యంతో ఇవ్వడమైనది. స్టేడియంలోని క్రీడాకారులకు పాదచారులకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ మరియు మంచినీటి చలివేంద్రంను నేతాజీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది మజ్జిగ చలివేంద్రంలో ప్రతిరోజు 700 మజ్జిగ ప్యాకెట్లను సభ్యుల యొక్క సహకారంతో పంచుటకు సిద్ధం చేసాము కొండిశెట్టి వెంకటరమణ దాతృత్వంతో ఈరోజు 700 ప్యాకెట్లను పంచడమైనది.

ఈ కార్యక్రమంలో ఏవిపి ఏకొల్లు రాఘవ రెడ్డి, 203 గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, అసోసియేషన్ అధ్యక్షులు షేక్ నసీర్ అహ్మద్, కార్యదర్శి శానంపూడి సుబ్బరా యుడు, కోశాధికారి సితారి రత్నం, గౌరవాధ్యక్షులు బిరుదవోలు రామ్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాంత్ వివాహ రిసెప్షన్‌కు పలువురు వైసీపీ నేతలు హాజరు

**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో టిఎన్‌సి హై స్కూల్ విశ్రాంతి టీచర్ పి.పుల్లయ్య కుమారుడు శ్రీకాంత్ వివాహ రిసెప్షన్‌కు పలువురు వైసీపీ నేతలు ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. జిల్లా ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు శివుని నరసింహారెడ్డి, వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు అత్తిపల్లి అనూప్ రెడ్డి, పలువురు స్థానిక నేతలు ఉన్నారు.



# వాత్సల్య ఆశ్రమంలో నివణ్య జన్మదిన వేడుకలు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు బీవీనగర్‌లోని వాత్సల్య ఆశ్రమంలో హరిణి హోటల్ అండ్ క్యాటరింగ్ అధినేత సీపి పెంచలయ్య మనవరాలు నివణ్య జన్మదిన వేడుకలను చిన్నారుల మధ్య శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో చిన్నారులకు పుస్తకాలు పెన్నులు, వృద్ధులకు అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపి పెంచలయ్య, నివణ్య తల్లి కీర్తి ప్రియలు మాట్లాడుతూ ఆశ్రమంలో అనాధ చిన్నారుల మధ్య తన మనవరాలు జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనంద కరంగా ఉందన్నారు. ప్రతి ఏడాది వాత్సల్య ఆశ్రమంలో తమ కుటుంబ సభ్యుల జన్మదిన వేడుకలను జరుపుకోవడం ఆనవా యితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యురాలు విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# సిఎస్ఆర్ నిధులతో శివపురం ఫిష్ సీడ్స్ ఫారం పునరుద్ధరణకు చర్యలు

## - రూ.1.99 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశం : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** నర్సీపట్నం అర్బన్ పరిధిలోని శివపురం ఫిష్ సీడ్స్ ఫారాన్ని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ శుక్రవారం వాటర్ రిసోర్సెస్ శాఖ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ చాలా కాలంగా వినియోగంలో లేని ఫిష్ సీడ్స్ ఫారాన్ని పునరుద్ధరించడం ద్వారా మత్స్య రంగానికి కొత్త ఊపు తీసుకురావచ్చని తెలిపారు. సి.యస్.ఆర్ నిధుల ద్వారా సుమారు రూ. 1.99 కోట్ల వ్యయంతో రేన్యూవేషన్ పనులు చేపట్టేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని ఫిషరీస్ మరియు వాటర్ రిసోర్సెస్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ అమలు ద్వారా స్థానిక మత్స్యకారులకు నాణ్యమైన ఫిష్ సీడ్స్ అందుబాటులోకి రావడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, జిల్లాలో మత్స్య ఉత్పత్తి వృద్ధికి దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వి.వి. రమణ, మున్సిపల్ కమిషనర్ జె. సురేంద్ర, తహసీల్దార్ ఎల్.రామారావు, జేడీ ఫిషరీస్ తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి జిల్లాలో 2,52,843, మందికి రూ.107.38 కోట్లు విడుదల

## - ఎన్.టి.ఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్





**నర్సీపట్నం, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలోని ప్రతి లబ్ధిదారునికి ఎన్.టి.ఆర్ భరోసా పెన్షన్లు సక్రమంగా అందేలా పంపిణీ పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి, 24వ వార్డ్ చాకలిపేటలో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందించారు. పింఛన్లు పంపిణీ విధానంపై ఆరా తీసి సక్రమంగా సకాలంలో అందుతున్నది, లేనిది లబ్ధిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో జరుగుతున్న పింఛన్లు పంపిణీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం 2,52,843 మంది లబ్ధిదారులకు రూ.107.38 కోట్లు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధి 24వ వార్డ్ చాకలిపేట మరియు 24 గ్రామీణ మండలాల్లో ఉదయం 5 గంటల నుంచే లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. శతశాతం పెన్షన్లు పంపిణీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ ప్రోజెక్టు డైరెక్టరు కె.శచీదేవి, మున్సిపల్ కమిషనర్, వార్డ్ మెంబర్ తదితరులు పాల్గొన్నారు.

# జన గణనపై చైతన్య ర్యాలీ, సెన్సస యాప్ ప్రారంభించిన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** దేశాభివృద్ధికి కీలకమైన జనాభా గణన ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. శుక్రవారం ఉదయం నర్సీపట్నం స్థానిక శివపురం జంక్షన్ నుండి ఆంజనేయ టెంపుల్ వరకు జనగణన 2027 ప్రాముఖ్యత నినాదాలతో స్లోగాన్స్‌తో ప్రజలకు అవగాహన కల్పించుటకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించడమైనది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ ఈసారి జనాభా గణన ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ప్రతి పౌరుడు ప్రభుత్వం అందించిన లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని, దేశ ప్రగతికి తోడ్పడాలని కోరారు. ప్రజలు తమ సమాచారాన్ని సులభంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. జనాభా గణన అనేది కేవలం అంకెలు మాత్రమే కాదని, భవిష్యత్ ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు ఇది పునాదని స్పష్టం చేస్తూ, జనాభా గణన ప్రాముఖ్యతను తెలుపుతూ జనాభా లెక్కల సేకరణలో ప్రతి ఒక్కరూ పారదర్శకంగా పాల్గొని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ జిల్లా యంత్రాంగం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వి.వి.రమణ, మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, తహసీల్దార్ ఎల్.రామారావు ఎన్యూమరేటర్స్, సూపర్వైసర్లు, ఇతర జిల్లా అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా రాంబిల్లి మండలంలో మే డే కార్యక్రమాన్ని నిర్వహించిన సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దేవుడు నాయుడు






**రాంబిల్లి, (రాజధాని వార్తలు):** రాంబిల్లి మండలంలోని కొత్తపట్నం, నావిగేట్, రాంబిల్లి, వై.లోవ, పెద కలవలపల్లి, వేల్చూరు, లోవ పాలెం, గజ రెడ్డిపాలెం, మామిడి వాడ, అప్పారాయుడుపాలెం, వెంకటాపురం కేంద్రాల్లోనూ సిఐటియు నాయకత్వంలో, వివిధ రంగాల కార్మికులు, మేడే జెండాలు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.దేవుడు నాయుడు, రాంబిల్లి మండల కన్వీనర్ చందక రామకృష్ణ మాట్లాడుతూ ఈ మేడే కార్యక్రమం ప్రపంచ వ్యాప్తంగా, కార్మికులు రక్తం చిందించి, ఎనిమిది గంటల పని విధానం 140 ఏళ్ల క్రితం సాధించుకుంటే, మనదేశంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కలగలిసి, కార్మికులకు పని గంటలు పెంచడం, కార్మికుల శ్రమను దోచిపెట్టి కార్పొరేట్లకు అందించడమే పరమ పవిత్ర కార్యక్రమంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వాలకి కార్పొరేట్లు, పరిశ్రమకు అధిపతులు తప్ప సామాన్య ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు కనిపించడం లేదని విమర్శించారు. సర్వసంపదలు సృష్టించేది, కార్మికులు, రైతులు అయితే ప్రభుత్వాలు మాత్రం ధనవంతులకు ఊడిగం చేస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులకు మంచి చేస్తామని అధికారం చేపట్టిన ఈ ప్రభుత్వాలు, కార్మికులతో యుద్ధం చేస్తున్నాయని, ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా కార్మికులకు ఇచ్చిన వాగ్దానా లు అమలు చేయకపోతే, రాబోయే కాలంలో మేడే స్ఫూర్తితో కార్మికుల ప్రతిఘటన తప్పదని ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, నారాయణ రావు, కాసియా, శివాజీ, రాము, రమణ, బంగార్రాజు, భాస్కర రావు, ధనరాజు, నేవీ నిర్మాణ కార్మికులు, ఆటో, ముఠా కార్మికులు, కొబ్బరి ఒలుపు దింపుడు కార్మికులు, భావన నిర్మాణ కార్మికులు, ట్రాక్టర్ అండ్ లారీ డ్రైవర్, ఎస్సీజెడ్ కార్మికులు పాల్గొన్నారు.

# రాంబిల్లి మండలంలో కిషోర వికాసం వేసవి కాల శిక్షణ కార్యక్రమాలు





**రాంబిల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా కలెక్టర్, జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఆదేశాల మేరకు రాంబిల్లి మండలంలోని హరిపురం, రాంబిల్లి గ్రామలలో అంగన్వాడి సూపర్వైజర్, అంగన్వాడి వర్కర్ వారి ఆధ్వర్యంలో "కిషోర వికాసం వేసవి కాలా శిక్షణా కార్యక్ర మాలు 11 సం. నుండి 18 సం.లోపు గల కౌమారదశ బాల బాలికలకు కనీసం 5 మందికి తక్కువ లేకుండా సంఘాలను ఏర్పాటు చేసి బడి బయట, బడిలోపల ఉన్న పిల్లలను గుర్తించి వారితో 20 మంది పిల్లలకు మించకుండా గ్రామస్థాయిలో సంఘాలను ఏర్పాటు చేసి వారంలో ప్రతి మంగళవారం, శుక్రవారం ఉదయం 10 గంటలకు బాలికలకు, మధ్యాహ్నం మూడు గంటలకు బాలురులకు వీటి ద్వారా కౌమార దశలో గల పిల్లల సమస్యలను గుర్తించి వారిని సక్రమ మార్గం వైపు తీసుకు వెళ్లడమే దీని యొక్క ముఖ్య ఉద్దేశ్యం. అంతేకాకుండా బాలల రక్షణ, ఆరోగ్యం, విద్య, సాధికారత, లింగ వివక్షత, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత విషయాలపై పూర్తి అవగాహన కల్పించడం దీని యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్ర మంలో జిల్లా బాలల సంరక్షణ విభాగ ప్రతినిధి క్షేత్రస్థాయి కార్య కర్త కె.ఎల్.వి రమ్య, ఎస్వీఎస్ రాణి అంగన్వాడి సూపర్వైజర్, అంగన్వాడీ టీచర్స్‌తో సంఘం నియమించి తీర్మానం చేయడం జరిగినది.

# రూ.185.59 కోట్లతో సమగ్ర నీటి సరఫరా విస్తరణ

## - పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు - నర్సీపట్నం తాగునీటి ప్రాజెక్ట్ పనులపై తనిఖీ : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం మున్సి పాలిటీలోని అమలవుతున్న రూ.185.59 కోట్ల తాగునీటి సర ఫరా విస్తరణ ప్రాజెక్ట్ పనులను అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ శుక్రవారం పరిశీలించారు. యెండపల్లి వద్ద 650 కిలో లీటర్ల రా వాటర్ సంప్‌ను సందర్శించి పనుల పురోగతిని సమీక్షిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ యెలేరు కాలువ నుంచి రోజుకు 29.48 ఎంఎల్డీ నీటి సరఫరా లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పైప్‌లైన్ పనులు, రిజర్వాయర్ల నిర్మాణం వేగంగా కొనసాగుతున్నాయని, ఇప్పటికే 80 కి.మీ హెచ్‌డీపీఈ పైప్‌లైన్ వేసినట్లు పేర్కొన్నారు. పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేసి నిర్ణీత గడువులో ప్రజలకు తాగునీరు అందించాలని అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పాస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ఫ్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మీ సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యూట్యూబర్ శివారెడ్డి కుటుంబానికి రూ. 5 లక్షలు ఆర్థిక సహాయం చేసిన 164 గ్రామాల మత్స్యకారుల కాపులు

## - మత్స్యకార గ్రామాల కాపులు బాధిత కుటుంబానికి చేసిన ఆర్థిక చేయూతతో పలువురు ప్రశంసించారు






**ఉలవపాడు /చాకిచర్ల పెద్దపాలెం, (రాజధాని వార్తలు):** కడలూరు మరబోట్ల వివాదంపై 164 గ్రామాల కాపుల సమావేశంకు న్యూస్ కవరేజ్ కొరకు వచ్చి తిరిగిపోతున్న యూ ట్యూబ్ విలేకరి శివారెడ్డి రోడ్డు ప్రమాదములో చాకిచర్ల మలుపు వద్ద మృతి చెందడంతో మత్స్యకార వేదిక పెద్దలు కాపులు చొరవతో బాధిత కుటుంబానికి 5 లక్షల రూపాయలు ఆర్థిక సాయం చేసి మానవత్వంను చాటు కొన్నారు. మంచి చెయ్యడంలో మత్స్యకారులు చూపిన చొరవతో పలువురు అభినందనలు తెలిపారు. పాకలలో ఏర్పాటు చేసిన బోట్లు వివాదం సమావేశం విఫలం కావడంతో మరల రామాయ పట్నంలో కూడా అనుకున్న రీతిలో సమావేశం జరగనందున చివరిగా ఈనెల 22వ తారీకు కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండలంలోని చాకిచర్ల పెద్ద పట్టపు పాలెం గ్రామంలో 164 మత్స్యకార గ్రామాల కాపుల సమావేశం నిర్వహించారు. ఈ కాపుల వేదికను గ్రామ కాపుల ఆహ్వానం మేరకు న్యూస్ కవరేజ్ చేయడానికి మండలంతో పాటు నియోజక వర్గ స్థాయి పాత్రికేయులు హాజరయ్యారు. సమావేశం ముగిసిన అనంతరం పాత్రికేయులు తిరుగు ప్రయాణంలో దురదృష్టవ శాత్తు ఒంగోలు యూట్యూబ్ ఛానల్ విలేకరి శివారెడ్డి అను పాత్రికేయుడు చాకిచెర్ల తూములు మలుపు వద్ద మోటార్ సైకిల్ ప్రమాదంలో మరణించాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 9 సం., 5 సం. వయసు కలిగిన ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. అతని మరణంతో ఆ కుటుంబం దిక్కులేని వారయ్యారు.

ఈ విషయం తెలుసుకున్న సహచర పాత్రికేయులు ఈ సమాచారాన్ని చాకిచర్ల పెద్దపట్టపుపాలెం గ్రామ కాపులకు విన్నవించు కొన్నారు. వెంటనే సానుకూలంగా స్పందించిన కాపులు ఈ నెల 29వ తేదీన 164 గ్రామాల కాపుల సమావేశం నిర్వహిస్తున్నామని ఆ సమావేశంలో పాత్రికేయుని కుటుంబానికి తమ వంతు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం బుధవారం సమావేశం నిర్వహించి ఈ సమావేశంలో పాత్రికేయుని ఇద్దరు చిన్న పిల్లలను కూడా తీసుకొని వెళ్లడంతో ఆ సమావేశంలో పిల్లలను చూసిన కాపులు చలించిపోయారు. మత్స్యకారుల జీవన విధానాన్ని కట్టుబాట్లను బయటి ప్రపంచానికి తెలియ జేయడానికి వచ్చి దురదృష్టవశాత్తు మరణించిన పాత్రికేయుని కుటుంబానికి న్యాయం చేయాల్సిన బాధ్యత తమ పైన ఉందని గ్రహించి 164 గ్రామాల కాపుల సమక్షంలో ఇద్దరు చిన్న పిల్లల పేరుపై ఐదు లక్షల రూపాయలు ఫిక్స్ డిపాజిట్ చేస్తామని సమావేశంలో ప్రకటించారు. కాపులు ఆర్థిక సాయం ప్రకటించడంతో సమావేశంలో హర్షం వ్యక్తం చేసారు. అదేవిధంగా తోటి పాత్రికేయుని కుటుంబానికి సాయం చేసినందుకు మండలంలోని పాత్రికేయులు 164 గ్రామాల మత్స్యకార కాపులకు కృతజ్ఞతలు తెలపడం జరిగింది. మత్స్యకారులు కుల సాంప్రదాయం కట్టుబాట్లుతో ఒక కుటుంబానికి అండగా నిలబడిందని చెప్పవచ్చు. మంచి కోసం మత్స్యకారులు ఎంత దూరమైనా పోరాటం చేస్తారని నిజ నిర్ధారణ అయింది.

# చిరంజీవి ఉన్నత స్థాయికి ఎదగాలి

## - వైసీపీ కోవూరు మండలం అధ్యక్షులు అత్తిపల్లి అనూప్ రెడ్డి



**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు మల్లవరపు చిరంజీవిఉన్నత స్థాయికి ఎదగాలని కోవూరు మండలం వైసీపీ అధ్యక్షులు అత్తిపల్లి అనూప్ రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం పడుగుపాడు శ్రీనివాసపురంలో నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మాట్లాడారు. చిరంజీవి అందరితో స్నేహభావంతో ఉంటారని పార్టీ బలోపేతం కొరకు పనిచేసే స్వభావం కలిగిన నేతగా ఉన్నారని ఆయన ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని పలువురు వైసీపీ నేతలు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షులు శివ నరసింహారెడ్డి, జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి నీలపరెడ్డి హరి ప్రసాద్ రెడ్డి కోవూరు మండల పార్టీ అధ్యక్షులు అత్తిపల్లి అనూప్ రెడ్డి, జిల్లా రైతు విభాగం కార్యదర్శి తోడేటి మహేష్, మండల పార్టీ కార్యదర్శి సిద్ధవరపు కిషోర్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి గున్నం జనార్ధన్, ఎస్టీ సెల్ కోవూరు నియోజకవర్గం నేత కవరగిరి ప్రసాద్, జిల్లా యువజన విభాగం కార్యదర్శి మేకల మోషే, స్థానిక వైసీపీ నేతలు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ రథాలకు నేచురల్ స్టార్ నాని సహాయం.. స్పందించిన డిప్యూటీ సీఎంవో

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లో 'స్వచ్ఛరథాలు' కార్యక్రమానికి ప్రముఖ సినీ హీరో, నేచురల్ స్టార్ నాని సహాయం చేయడంపై ఉప ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. నాని సహాయంపై ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. అడిగిన వెంటనే సాయం చేయడంపై ప్రశంసలు కురిపించింది.

**డిప్యూటీ సీఎంవో ఎక్స్ పోస్టు..**

'మన పారిశుద్ధ్యం.. మన ఆరోగ్యం.. మన బాధ్యత' అనే నినాదంతో పవన్ ఆలోచనల నుంచి స్వచ్ఛరథాలు పురుడుపోసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ఈ స్వచ్ఛరథాలు విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయి. చెత్త నుంచి సంపద సృష్టి అనే యజ్ఞంలో గ్రామీణ ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తూ దూసుకుపోతున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను సులభతరం చేసేందుకు కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన స్వచ్ఛరథాల గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు అడిగిన వెంటనే తన వంతు సహాయ సహకారాలు అందించిన ప్రముఖ హీరో నానికి పవన్ కల్యాణ్ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఈ స్వచ్ఛరథాలు ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో సుమారు 19 లక్షల కేజీల



పొడి చెత్త కొనుగోలు చేయడం ద్వారా రూ.3.32 కోట్ల విలువ గల నిత్యావసరాలను ప్రజలకి అందించాయని చెప్పేందుకు ఆనందిస్తున్నాం. గ్రామాల్లో పారిశుద్ధ్య ఉద్యమం పట్ల ప్రజల్లో పెంపొందుతున్న అవగాహనకు ఇది నిదర్శనం. భవిష్యత్తు తరాలకు వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు ప్రతి గురువారం పాఠశాలల వద్దకు ఈ స్వచ్ఛరథాలు వెళ్లి.. పొడి చెత్తకు బదులుగా పుస్తకాలు, స్టేషనరీ ఇచ్చే విధంగా చేసిన ఏర్పాటు సత్ఫలితాలను ఇస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడి స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు ఈ స్వచ్ఛరథం కార్యక్రమాన్ని ప్రారంభించాం' అని డిప్యూటీ సీఎంవో ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan